సోమవారం
17-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 26
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

తూర్పు ఆసియా జోలికి వెళ్లొద్దు

తూర్పు ఆసియా దేశాల జోలికి వెళ్లవద్దని, ఆ ప్రాంతంలో అడుగు పెట్టే ధైర్యం చేయొద్దని నాటోకు చైనా స్పష్టం చేసింది. తూర్పు ఆసియాలో శాంతి స్థాపనలో ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య (ఏషియన్) కీలక పాత్రను తక్కువ చేసే విధంగా జరుగుతున్న ప్రయత్నాలను విమర్శించింది.

2 లో

ముందస్తు వలసలు

- నేతల ఎన్నికల ఫీట్లు
- లోకేశ్‌తో వైసీపీ ఎంపీ ముచ్చట్లు!
- జనసేనలోకి 'ఆమంచి'
- అధికార పార్టీలో ఆందోళన



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఏడాదిలోగా ఎన్నికలు ఉండటంతో రాజకీయ పార్టీల్లో వలసల సందడి మొదలైంది. ఈ నాలుగేళ్లలో ప్రతిపక్ష టీడీపీ నుంచి వైసీపీలోకి వలసలు భారీగా రాగా, ఇటీవల దానికి రివర్స్‌గా వైసీపీ నుంచి టీడీపీలోకి ప్రారంభమయ్యాయి. ఇంతవరకు ఎలాంటి కేడర్ లేదనుకునే జనసేనలోకి సైతం వైసీపీ నుంచి వలసలు రావడం అధికార పక్షాన్ని కలవరానికి గురిచేస్తోంది. విశాఖజిల్లా వైసీపీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు వైసీపీకి రాజీనామా చేసి, ఆ పార్టీకి పెద్ద షాక్ ఇచ్చారు. ఇది వైసీపీ పార్టీకి కోలుకోలేని దెబ్బ కానుంది. రెండేళ్ల క్రితం వైసీపీలోకి వచ్చిన ఆయన, తిరిగి పార్టీని వీడారు. ఇటీవలే ఆయన రాజీనామాను ప్రకటించి, తాను పార్టీ బలోపేతానికి కృషి చేద్దామనే ప్రయత్నానికి చుట్టూ ఉండే అధినాయకత్వం అడ్డంకులు సృష్టిస్తోందంటూ వ్యాఖ్యానించారు. ఇక టీడీపీలోకి ఏకంగా నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు వస్తున్నారని తెలిసింది. ఇటీవల శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత బీఎస్ రావు అంత్యక్రియల సందర్భంగా, అక్కడికి వచ్చిన టీడీపీ నాయకుడు లోకేశ్‌తో ఆ ఎంపీ కరచాలం చేయడం, పక్కకెళ్లి ఇద్దరూ కొద్దిసేపు మాట్లాడుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఆయన టీడీపీలోకి వెళ్తారా? అనే ఆందోళనలో వైసీపీ కేడర్ ఉంది. చాలా కాలం నుంచి ఎంపీ కృష్ణదేవరాయలు అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలొచ్చాయి. ప్రధానంగా అమరావతి రాజధాని విషయంలోనూ ఆయన రైతులకు నేరుగా మద్దతివ్వడం అప్పుడు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దీని ఆధారంగా ఆయన టీడీపీకి చెంతకు చేరుతారని

- మిగతా 2 లో

మోదీ పాలన అస్తవ్యస్తం

- పేట్రేగిన కుల-మత హింస
- ఉమ్మడి పౌరస్మృతితో సామాజిక విభజనే కేంద్రం లక్ష్యం
- బీజేపీ ఓటమే లక్ష్యంగా ఎన్నికలకు సిద్ధం కావాలి
- 25న మణిపూర్ సంఘీభావం దినం
- సీపీఐ జాతీయ సమితి నిర్ణయాలు వివరిస్తూ ప్రధాన కార్యదర్శి రాజా

న్యూఢిల్లీ:
కేంద్రంలోని మోదీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో దేశ లౌకిక, ప్రజాస్వామిక వ్యవస్థకు తీవ్ర నష్టం జరిగిందని, కుల-మత హింస పేట్రేగిందని, మైనారిటీలపై వివక్ష పెరిగిందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఫెడరల్ వ్యవస్థకు ప్రభుత్వం వ్యతిరేకమని బహిర్గతమైందన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలను దుయ్యబట్టారు. కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఈ నెల 14,15, 16 తేదీల్లో ఇక్కడి అజయ్‌భవన్‌లో జరిగిన సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ఆదివారం ముగిశాయి. అనంతరం సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు వినయ్ విశ్వం, అతుల్ కుమార్ అంజాన్, కె.నారాయణ, కాంగోతో కలిసి రాజా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జాతీయ సమితి నిర్ణయాలు, ఆమోదించిన తీర్మానాలను వివరించారు. ఉమ్మడి పౌరస్మృతి ద్వారా సామాజిక- మతపరమైన విభజనను మోదీ ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని రాజా అన్నారు. దిగిరాని ద్రవ్యోల్బణం, పెరిగిన నిరుద్యోగం, నీరుగారిన రైతుల ఆదాయం రెట్టింపు హామీ, బ్యాంకు రుణఎగవేతదారులపై చర్యలు తదితర అనేక అంశాలపై సమావేశం తీర్మానించినట్లు తెలిపారు. జులై 25న దేశవ్యాప్తంగా మణిపూర్ సంఘీభావ దినంగా జరుపుకోవాలని జాతీయ సమితి పిలుపునిచ్చిందన్నారు. రాష్ట్ర పరిస్థితిపై ప్రధాని మౌనాన్ని దుయ్యబట్టింది. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి అనీరాజా, నాయకులు నిషా సిద్ధూ, దీక్షా ద్వివేదిపై ఎఫ్ఐఆర్‌ను ఖండిస్తూ దానిని తక్షణమే ఉపసంహరించుకోవాలని పార్టీ డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. విభజించి పాలించు సిద్ధాంతానికి కట్టుబడి ప్రజలను విభజించి రాజకీయంగా లబ్ధి పొందాలని ప్రధానమంత్రి, ఆయన పార్టీ భావిస్తోందని వ్యాఖ్యానించారు. సామాజిక వైవిధ్యతకు విఘాతం కలిగించవద్దని, భాగస్వాములందరితో సంప్రదింపులు జరిపి ఉమ్మడి పౌరస్మృతిపై నిర్ణయానికి రావాలని బీజేపీ ప్రభుత్వాన్ని సీపీఐ కోరుతోందని రాజా చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతి అనవసరమని 21వ లా కమిషన్ స్పష్టం చేసిందని గుర్తుచేశారు. సరైన ముసాయిదా లేకపోవడం, చర్చలు జరపకపోవడం, ప్రజల అభిప్రాయాన్ని సేకరించకపోవడం సబబు కాదన్నారు. ఏకరూపత సమానత్వం కాబోదని, లింగ సమానత్వానికి తమ పార్టీ కట్టుబడి ఉందని రాజా స్పష్టంచేశారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలను దుయ్యబట్టారు. లౌకిక, ప్రజాస్వామ్య, ఫెడరల్ వ్యవస్థకు మోదీ ప్రభుత్వం తూట్లు పొడిచిందని పేర్కొన్నారు. ఈ ఏడాది తెలంగాణ, రాజస్థాన్,

- మిగతా 2 లో

బెంగాల్‌లో బీజేపీకి గడ్డుకాలం

పుంజుకున్న లెఫ్ట్ - పెరిగిన ఓట్లు

పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాలు క్రమంగా పుంజుకోగా ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ బలహీనమౌతోంది. దీంతో 2024 నాటికి బెంగాల్‌లో రాజకీయాల ధోరణి మారిపోనుంది. ఎప్పటిలా రెండు పార్టీల మధ్య కాకుండా త్రిముఖ పోటీకి రాష్ట్రంలో ఆస్కారం కలుగుతుంది.

8లో

బియ్యం ఎగుమతులపై నిషేధం?

ఆహార ద్రవ్యోల్బణం ప్రభావంతో కేంద్రం యోచన

న్యూఢిల్లీ :
ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఎగుమతిదారుగా ఉన్న భారతదేశం, పెరుగుతున్న ఆహార ద్రవ్యోల్బణానికి ప్రతిస్పందనగా చాలా బియ్యం రకాల ఎగుమతులను నిషేధించాలని ఆలోచిస్తున్నట్లు వార్తా సంస్థ బ్లూమ్‌బెర్గ్ గురువారం నివేదించింది. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రస్తుతం ద్రవ్యోల్బణం ప్రమాదాన్ని తగ్గించే లక్ష్యంతో బాస్మతియేతర బియ్యం ఎగుమతులను నిలిపివేసే ప్రతిపాదనను చర్చిస్తోంది. ఈ చర్య భారతదేశం బియ్యం ఎగుమతుల్లో దాదాపు 80 శాతం ప్రభావితం చేస్తుంది. దేశీయంగా బియ్యం ధరలను తగ్గించవచ్చు కానీ ప్రపంచ ధరలపై ప్రతికూల

- మిగతా 2 లో

ఐదులో నాలుగు ఆత్మహత్యలే

- దిగ్భ్రాంతి కలిగిస్తున్న ఖైదీల మరణాల గణాంకాలు
- వారి మానసిక ఆరోగ్యంపై పాలకుల నిర్లక్ష్యం
- పీఎస్ఐ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ :
దేశంలోని జైళ్లలో ఖైదీలు అసహజ మరణాలకు గురవుతున్నారు. 2021లో దేశంలోని జైళ్లలో 'అసహజ కారణాల' వల్ల సంభవించే ప్రతి ఐదు మరణాలలో నాలుగు ఆత్మహత్యలే కావడం దిగ్భ్రాంతి గొల్పుతోంది. ది ప్రిజన్ స్టాటిస్టిక్స్ ఇండియా (పీఎస్ఐ) 2021, జైళ్లు, వాటి పరిపాలనపై జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్‌సీబీ) తాజా నివేదికలో ఈ సంఖ్యలు వెల్లడయ్యాయి. నివేదిక ఆత్మహత్యలను 'అసహజ మరణాలు' కింద పేర్కొంది. జైలు ఖైదీలు ఆత్మహత్య చేసుకునే కొన్ని సాధారణ పద్ధతులను గుర్తిస్తుంది. నివేదిక ప్రకారం, 2021 సంవత్సరంలో కస్టడీలో మరణించిన 2,116 మంది ఖైదీలలో 185 మరణాలు 'అసహజ కారణాల' వల్ల సంభవించాయి. అలాంటి మరణాలకు ఆత్మహత్యలే అధిక కారణం, 150 మరణాలకు దారితీసింది. ఆత్మహత్యల కారణంగా ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక మరణాలు నమోదయ్యాయి. 2021లో రాష్ట్రంలో 34 మంది ఖైదీలు ఆత్మహత్య చేసుకున్నారు. కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్ (సీహెచ్‌ఆర్ఐ) నివేదిక ప్రకారం, 2019 పీఎస్ఐ గణాంకాల ఆధారంగా ఖైదీలలో ఆత్మహత్య రేట్లు దేశంలోని సాధారణ జనాభాలో నమోదయిన దాని కంటే రెండు రెట్లు ఎక్కువ. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఖైదీలు ఉద్దేశపూర్వకంగా స్వీయ హాని, ఆత్మహత్యలను తగ్గించే ఉద్దేశంతో జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జూన్ 19న ఒక సలహా జారీ చేసింది. ఖైదీల ఆత్మహత్యలు, స్వీయ హాని నివారణకు సంబంధించి మూడు నెలల వ్యవధిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని, నివేదికలను సమర్పించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను నిర్దేశించింది. జైళ్లలో 'అసహజ మరణాలు' అధిక శాతంగా ఉన్నాయని, అలాంటి 80 శాతం మరణాలకు ఆత్మహత్యలే ప్రధాన కారణం. సలహా ప్రకారం, జైళ్లలో ఆత్మహత్యాయత్నానికి దారితీసే అనేక కారణాలలో వైద్య, మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. ఖైదీల ఆరోగ్యం, భద్రతను కాపాడే బాధ్యత జైలు అధికారులదే అయినందున, ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉండటం మానవ హక్కుల ఉల్లంఘనేనని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రధానంగా ప్రస్తావించింది. సలహా ప్రకారం, ఆత్మహత్య ద్వారా మరణాన్ని అరికట్టడానికి భారతదేశం అంతటా జైలు అధికారులు తీసుకోవలసిన విస్తృత చర్యలు క్రింది విధంగా ఉన్నాయి. మానసిక ఆరోగ్యంపై చట్టాలు, నిబంధనలకు, ప్రత్యేకించి మెంటల్ హెల్త్‌కేర్ యాక్ట్-2017, మెంటల్ హెల్త్‌కేర్ (మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల హక్కులు) రూల్స్, 2018లోని నిబంధనలకు రాష్ట్ర ప్రభుత్వాలు, జైలు పరిపాలనలు కట్టుబడి

- మిగతా 2 లో

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ జాప్యం

- అభ్యర్థుల ఆందోళన
- కంప్యూటర్ కోర్సుపై ఆసక్తి
- ఇతర రాష్ట్రాల వైపు చూపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్) 2023 వెబ్ కౌన్సెలింగ్ జాప్యంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఏపీ అభ్యర్థులు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ఫలితాల వెల్లడి సమయంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. ఆ తేదీ దాటిపోయినా ఇంతవరకు వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియపై ఎలాంటి కదలిక కనిపించడం లేదు. జాతీయస్థాయిలో జరిగే ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ ప్రవేశాలు పూర్తయ్యాకే ఈఏపీసెట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, తెలంగాణలో కౌన్సెలింగ్‌కూ తమకు సంబంధం లేదని మంత్రి బొత్స చేసిన వ్యాఖ్యలతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఏపీ ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లోనూ శుక్రవారం సాయంత్రం వరకు కౌన్సెలింగ్‌పై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీరింగ్ సీట్లలో కంప్యూటర్, అనుబంధిత బ్రాంచ్‌లకు డిమాండ్ ఉండటంతో, వాటికే అభ్యర్థులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఐఐటీ, ఎన్ఐటీ నుంచి డీమ్డ్, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో సైతం కంప్యూటర్ బ్రాంచినే అభ్యర్థులు ఎంచుకోవడంతో ఈ దుస్థితి ఎదురైంది. దీనిని గమనించిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం భారీగా ఫీజుల దోపిడీ చేస్తోంది. ఏపీ ఈఏపీసెట్‌లో కౌన్సెలింగ్‌లో అత్యధికంగా ఇంజినీరింగ్ సీట్లే ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు 252 ఉండగా... మొత్తం లక్షా 49వేల సీట్లు ఈ విద్యాసంవత్సరం కౌన్సెలింగ్‌కు అనుమతి లభించింది. ఎక్కువ మంది అభ్యర్థులు ఇంజినీరింగ్ సీట్ల కోసమే ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర విద్యార్థులు ఏపీతోపాటు కర్నాటక, చెన్నై, హైదరాబాద్, ఒడిశా, రాజస్థాన్ తదితర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు పొందుతున్నారు. వారిలో అధిక శాతం కంప్యూటర్ ఇంజినీరింగ్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

యథేచ్ఛగా తుపాకీ లైసెన్సులు!

- అగ్ర స్థానంలో యూపీ, జమ్ముకశ్మీర్
- అక్రమ లైసెన్స్‌ల దుర్వినియోగం అధికం

న్యూఢిల్లీ:
దేశంలో తుపాకీ లైసెన్సులు యథేచ్ఛగా పొందుతున్నారు. ఫలితంగా అది దుర్వినియోగమవుతున్న సందర్భాలూ అనేకం ఉన్నాయి. తుపాకీ లైసెన్స్ పొందిన వారి విషయానికి వస్తే కేంద్ర పాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముందంజలో ఉన్నాయి. దేశంలో జారీ అయిన తుపాకీ లైసెన్స్‌ల సంఖ్యను సమాచార హక్కు చట్టం ద్వారా గుర్తించినట్లు 'ది వైర్' వార్తా సంస్థ కథనం పేర్కొంది. తుపాకీ లైసెన్స్‌దారులు అత్యధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. దీని తర్వాత కేంద్ర పాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్, పంజాబ్ ఉన్నాయి. 2016-2023 మధ్య కాలంలో అత్యధిక సంఖ్యలో తుపాకీ లైసెన్స్‌లను జారీ చేసిన 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్ముకశ్మీర్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, హరియానా, మహారాష్ట్ర, మణిపూర్, నాగాలాండ్. 2016లో ఉత్తర ప్రదేశ్, జమ్ముకశ్మీర్, పంజాబ్, మధ్య ప్రదేశ్, హరియానా, రాజస్థాన్, కర్నాటక, మహారాష్ట్ర, బీహార్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు అత్యధిక సంఖ్యలో తుపాకీ లైసెన్సులను కలిగి ఉన్నాయి. జమ్ముకశ్మీర్ తుపాకీ లైసెన్స్‌ల జారీపై 2018లో నిషేధం విధించగా... 2023లో దీన్ని ఎత్తి వేశారు. రాజస్థాన్ పోలీసుల యాంటీ టెర్రర్ స్క్వాడ్ (ఏటీఎస్) జరిపిన దర్యాప్తులో గన్ లైసెన్స్ రాకెట్ వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో నిషేధం విధించారు. ప్రభుత్వ అధికారుల ప్రమేయం, ముఖ్యంగా కొందరు ఐఏఎస్ అధికారుల ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడయింది. అయినప్పటికీ, 2019 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం కేంద్ర పాలిత ప్రాంతంగా చేసిన పూర్వ రాష్ట్రం... 2016-2023 మధ్య కాలంలో

- మిగతా 2 లో

బీజేపీ ఓటమే లక్ష్యం

నేడు, రేపు బెంగళూరులో నిర్ణయాత్మక సమావేశాలు

లౌకిక, ప్రజాస్వామ్య పార్టీల ఐక్యత దిశగా మరో ముందడుగు: సీపీఐ

న్యూఢిల్లీ:
వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలన్న ఉమ్మడి లక్ష్యంతో 26 ప్రతిపక్ష పార్టీలు ముందుకెళుతున్నాయి. రాబోయే ఎన్నికల దృష్ట్యా ఉమ్మడి వ్యూహాలు, ప్రణాళికలపై చర్చించేందుకు కర్నాటక రాజధాని బెంగళూరులో సోమ, మంగళవారాలలో సమావేశమవుతున్నాయి. ఈ సమావేశాలకు కాంగ్రెస్ ఆతిథ్యమిస్తోంది. ఢిల్లీలో అధికారాలపై కేంద్ర ఆర్డినెన్స్‌ను పార్లమెంటులో వ్యతిరేకిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతుగా కాంగ్రెస్ ఆదివారం ప్రకటన చేసింది. దీంతో ప్రతిపక్షాల భేటీలో పాల్గొంటామని ఆప్ ప్రకటించింది. మహారాష్ట్ర రాజకీయ పరిస్థితులు మారడం, ఎన్‌సీపీలో చీలిక రావడం, పార్టీ అధినేత శరద్ పవార్‌తో రెబల్స్ తాజాగా భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. ఇలాంటి పరిణామాల దృష్ట్యా ప్రతిపక్షాల సమావేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఇవి నిర్ణయాత్మక సమావేశాలని, అనేక అంశాలు చర్చకు వస్తాయని, లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలను ఏకం చేసే దిశగా మరో ముందడుగు

- మిగతా 2 లో

ఇజ్రాయిల్‌లో భారీ ప్రదర్శనలు

న్యాయ సంస్కరణలకు వ్యతిరేకంగా నెతన్యాహు ఇంటి వద్ద ధర్నా

టెల్‌అవీవ్: ఇజ్రాయిల్‌లో ప్రజాందోళన మిన్నంటింది. నెతన్యాహు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 28 వారాలుగా దేశమంతటా ఆందోళనలు జరుగుతున్నాయి. కొత్త ప్రతిపాదించిన న్యాయ సంస్కరణల అమలులో నెతన్యాహు ప్రభుత్వం దూకుడు పెంచింది. దీంతో రాజధాని టెల్ అవీవ్‌లో భారీ స్థాయిలో ప్రదర్శనలు జరిగాయి. దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది టెల్ అవీవ్‌కు చేరుకొని నిరసనల్లో పాల్గొన్నారు. మరిన్ని ప్రధాన నగరాల్లోనూ నిరసనలు జరిగాయి. టెల్ అవీవ్ ప్రదర్శన క్రమంలో 'ఎస్‌ఓఎస్' అనే భారీ బ్యానర్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా గాల్లోకి గులాబీ, కాషాయ రంగులను వెదజల్లి ఆందోళనకారులు నిరసన తెలిపారు. జెరూసలేంలోని నెతన్యాహు ఇంటి వద్ద కాగడాలతో ధర్నా చేశారు. కోస్తా నగరాలైన హెర్జిలియా, నెతన్యాలో భారీ ప్రదర్శనలు జరిగాయి. ప్రధాని నెతన్యాహు (73) డీహైడ్రేషన్‌తో ఆసుపత్రి పాలైన సమయంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు జరగడం గమనార్హం. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం. న్యాయ సంస్కరణల అమలునకు కీలక బిల్లును నెతన్యాహు ప్రభుత్వం తెచ్చింది. దీంతో జడ్జిల నియామకాల్లో ప్రభుత్వానికి ప్రాతినిధ్యం లభిస్తుంది. ఈ బిల్లు చట్ట రూపం దాల్చాలంటే మరో రెండుసార్లు ఓటింగ్ ద్వారా ఆమోదించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ నెలాఖరుకు పూర్తి కావచ్చని తెలిసింది.

తూర్పు ఆసియా జోలికి వెళ్లొద్దు

నాటోకు చైనా హెచ్చరిక

బీజింగ్: తూర్పు ఆసియా దేశాల జోలికి వెళ్లవద్దని, ఆ ప్రాంతంలో అడుగు పెట్టే ధైర్యం చేయొద్దని నాటోకు చైనా స్పష్టం చేసింది. తూర్పు ఆసియాలో శాంతి స్థాపనలో ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య (ఏషియన్) కీలక పాత్రను తక్కువ చేసే విధంగా జరుగుతున్న ప్రయత్నాలను విమర్శించింది. ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించేందుకు ఏషియన్ చేస్తున్న కృషిని తీసిపారేడం తగదని హితవు పలికింది. జకార్తలో జరిగిన తూర్పు ఆసియా వార్షిక సదస్సు సందర్భంగా చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ, విదేశీ వ్యవహారాల కమిషన్ కార్యాలయ డైరెక్టర్ వాంగ్ యీ మాట్లాడుతూ చిన్న దేశాల భద్రతకు, సహకారానికి, అంతర్జాతీయ భద్రతా చర్యలకు చైనా సానుకూలంగా ఉందని చెప్పారు. సౌతీస్ట్ ఏషియా న్యూక్లియర్ వెపన్-ఫ్రీజోన్‌పై ఒప్పందం మీద సంతకాల కోసం నేతృత్వం వహించేందుకు సిద్ధమన్నారు. ప్రస్తుతానికి ప్రాంతీయ శాంతి, సుస్థిరత, అభివృద్ధి, సమర్థ సహకార విస్తరణ కోసం అందరితో కలిసి పనిచేయాలని ఏషియన్ దేశాలు కోరుకుంటున్నాయి. కాగా, ఇండోనేసియా రాజధానిలో జరిగిన ఈ సదస్సులో 10 ఆసియా దేశాలతో పాటు ఆస్ట్రేలియా, చైనా, జపాన్, భారత్, న్యూజిలాండ్, కొరియా, రష్యా, అమెరికా దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుమల వెంకన్నకు

బంగారు శంఖం బహూకరణ

విశాలాంధ్ర-తిరుమల: ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి, సుధామూర్తి దంపతులు శ్రీవారిని దర్శించుకుని భారీ కానుకలను సమర్పించారు. తిరుమల శ్రీవారికి రూ. 1.25 కోట్ల విలువ చేసే 2 కిలోల బంగారు పూజా సామగ్రిని ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి దంపతులు విరాళంగా అందించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల కైంకర్యాలకు వినియోగించే బంగారు అభిషేక శంఖం, కూర్మ పీఠాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి దంపతులను ఈఓ ధర్మారెడ్డి శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉదయం సుధా మూర్తి దంపతులు తమ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

ఉక్రెయిన్‌లో పర్యటించిన ద.కొరియా అధ్యక్షుడు

సియోల్: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఆకస్మికంగా ఉక్రెయిన్ దేశానికి వెళ్లారు. ఆ దేశాధ్యక్షుడు వొలోదిమీర్ జెలెన్‌స్కీతో మాట్లాడేందుకు ఆయన వెళ్లినట్లు దక్షిణ కొరియా అధ్యక్ష కార్యాలయం తెలిపినట్లు యోన్హప్ వార్తాసంస్థ నివేదించింది. నాటో సదస్సు తర్వాత పోలాండ్‌లో పర్యటించిన యూన్ సుక్ ఉక్రెయిన్‌లో ప్రత్యక్షమవ్వడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రష్యాపై యుద్ధం క్రమంలో ఉక్రెయిన్‌కు సంఘీభావాన్ని యూన్ సుక్ తెలిపారు. తమ వంతు సహకారం అందిస్తామన్నారు. రాజధాని కీవ్ సమీపంలోని బుచాలో సామూహిక హత్యకాండ జరిగిన స్థలిని, క్షిపణి దాడులతో దద్దరిల్లిన ఇర్పిన్ నగరాన్ని సందర్శించారు. అనంతరం జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. అయితే అమెరికాకు మిత్రపక్షంగా ఉన్న దక్షిణ కొరియాపై ఉక్రెయిన్‌కు ఆయుధ సాయం చేయాలన్న ఒత్తిడి పెరిగిందని తెలుస్తోంది. డీ-మైనింగ్ పరికరాలు, అంబులెన్సులను ఉక్రెయిన్‌కు పంపనున్నట్లు యూన్ సుక్ ఇంతకుముందే చెప్పారు. ఉక్రెయిన్ కోసం నాటో విశ్వాస నిధిలో భాగమవుతామని కూడా తెలిపారు.

మోదీ పాలన అస్తవ్యస్తం

(మొదటిపేజీ తరువాయి)

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికలకు సంబంధించి సంబంధిత రాష్ట్ర శాఖలు తగు నిర్ణయాలు తీసుకోవాలని, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల కోసం నిధుల సేకరణకూ పూనుకోవాలని రాజా సూచించారు. బీజేపీని ఓడించడంతో పాటు అసెంబ్లీలతో పాటు పార్లమెంటులో పార్టీ బలాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని స్పష్టంచేశారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రోకు శుభాకాంక్షలను తెలిపారు.

అసోం పార్లమెంటు నియోజకవర్గాల డిలిమిటేషన్ ప్రతిపాదనను వ్యతిరేకించడం, వరద బాధితులకు ఆహారం, తాగునీరు, పాలు, మందులు తదితరాలు అందజేయాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేయడం, బీజేపీయేతర రాష్ట్రాల్లో గవర్నర్ వ్యవస్థ ద్వారా పరిపాలన వ్యవహారాల్లో కేంద్ర జోక్యాన్ని వ్యతిరేకించడం వంటి అంశాలు తీర్మానాల్లో ఉన్నాయి. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిని తొలగించాలని, అటవీ, పర్యావరణం వ్యతిరేక బిల్లు ఉపసంహరించాలని కూడా సీపీఐ జాతీయ సమితి డిమాండ్ చేసింది. అసోంలో కూరగాయల ధరల అమాంతం పెరిగిపోవడానికి ముస్లిం వర్తకులను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంతా బిశ్వశర్మ నిందించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ ప్రకటనను రాష్ట్రంలో విద్వేషాన్ని-మతఘర్షణలను రెచ్చగొట్టే ప్రయత్నంగా వర్ణించింది. ధరలను నియంత్రించడంలో అసమర్థతను, వైఫల్యాలను కప్పించుకునేందుకు ఇతరులపై నిందలు వేస్తున్నారని సీఎంను దుయ్యబట్టింది. బ్యాంకు రుణాలను ఎగవేసే వారిపై ఆర్బీఐ పటిష్ఠ చర్యలు తీసుకోకపోతే ప్రజాధనాన్ని దోచుకోవడానికి చట్టబద్ధత కల్పించినట్లు అవుతుందని వ్యాఖ్యానించింది. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ అమలు కాకపోగా రైతుల సాగు వ్యయం మరింత పెరిగిందని పేర్కొంది. మోదీ విధానాలతో ఆర్థిక మందగమనం సాగుతోందని, ఇటీవల సంపన్నులతో పాటు పేదల సంఖ్య కూడా పెరిగిందని తెలిపింది. ప్రైవేటీకరణ విషయంలో కేంద్రప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోందని, మోదీ ఓ సందర్భంలో 'మన దేశంలో ప్రభుత్వ రంగం అంతమయ్యేందుకే ఆవిర్భవిస్తుంది' అని అనడాన్ని గుర్తుచేసింది. ఇటువంటి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యూనియన్ల పోరాటాలు సాగుతున్నాయని పేర్కొంది. కార్పొరేట్లకు బ్యాంకులు రుణమాఫీలు, రైటాఫ్‌లు కల్పిస్తున్నాయని తెలిపింది. గత నెలలో కావాలనే బ్యాంకులను మోసం చేసే రుణ ఎగవేతదారుల రుణాలను రద్దు చేస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటించిందని, వారిపై కఠిన చర్యలు తీసుకోకపోగా రాయితీలు ఇస్తూ కార్పొరేట్లపై ప్రేమను మోదీ ప్రభుత్వం ఒలకపోస్తోందని విమర్శించింది. ఈనెల 19వ తేదీకి బ్యాంకుల జాతీయాకరణకు 55 ఏళ్లు అవుతాయని, ఇందులో సీపీఐది ప్రధాన పాత్రని, బ్యాంకుల జాతీయాకరణ కోసం నాటి పార్టీ ఎంపీ, ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శిగా ప్రభాత్ ఖేర్ పోరాడారని సీపీఐ వెల్లడించింది.

బీజేపీ ఓటమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పడుతుందని ప్రతిపక్ష నాయకులు అన్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ 'బీజేపీని ఓడించే సంకల్పానికి ఈ రెండు రోజుల సెషన్ నిదర్శనమన్నారు. ఈ సమావేశాలతో లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలను ఏకం చేసే దిశగా మరో ముందడుగు పడుతుందని చెప్పారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం, బీజేపీని ఓడించడమే లక్ష్యమన్నారు. తాజా సమావేశాల్లో కాంగ్రెస్ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, జేఎంఎం నేత హేమంత్ సోరెన్, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే పాల్గొనున్నారు. ఈసారి సమావేశానికి ఎండీఎంకే, కేడీఎంకే, వీసీకే, ఆర్ఎస్‌పీ, ఫార్వర్డ్ బ్లాక్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్), కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), కేరళ కాంగ్రెస్ (మణి) పార్టీలకు కాంగ్రెస్ నుంచి ఆహ్వానం అందింది. ఈ సమావేశానికి తమను ఆహ్వానించలేదని, అందుకే రావడం లేదని కర్నాటకలో కాంగ్రెస్‌కు పూర్వ మిత్రపక్షమైన జనతా దళ్ (సెక్యులర్) పార్టీ పేర్కొంది. కాగా, ఈ నెల 18న ఢిల్లీలోని అశోక హోటల్‌లో జరగబోయే ఎన్డీయే సమావేశానికి 30 పార్టీలు హాజరుకానున్నాయి. 20వ తేదీన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానుండటంతో ఎన్డీయే, విపక్షాల సమావేశాలకు ప్రాధాన్యత పెరిగింది. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాని మోదీ అధ్యక్షతన ఎన్డీయే భేటీ జరగబోతోంది. ఎన్డీయేలో 24 పార్టీలు ఉండగా కొత్తగా మరికొన్ని పార్టీలను చేర్చుకునేందుకు బీజేపీ తహతహలాడుతోంది.

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ జాప్యం

(మొదటిపేజీ తరువాయి)

(సీఎస్‌సీ), అనుబంధ కోర్సులనే ఎంచుకుంటున్నారు. ఎక్కడ సీటు రాని వాళ్లంతా ఏపీ సెట్ కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. వారూ కంప్యూటర్ సీట్ల వైపే మొగ్గుచూపుతున్నారు.

యాజమాన్య సీట్లకు గిరాకీ

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ జాప్యం కారణంగా విద్యార్థులు తొలుత యాజమాన్య సీట్లలో కంప్యూటర్, అనుబంధ కోర్సులు రిజర్వు చేసుకుంటున్నారు. అందుకోసం రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఏపీలో పేరొందిన నాలుగైదు ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో ఇప్పటికే కంప్యూటర్, అనుబంధ కోర్సుల సీట్లు భర్తీ అయినట్లు సమాచారం. ఇంజినీరింగ్ మొదటి సంవత్సర విద్యార్థుల తరగతుల నిర్వహణకు ప్రైవేట్ యాజమాన్యం సిద్ధమైంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇక ప్రైవేట్/డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో సీట్లు పొందే స్థోమతలేని విద్యార్థులంతా కౌన్సెలింగ్‌పైనే ఆధారపడి ఉన్నారు. ఈ కౌన్సెలింగ్‌లో తమ ర్యాంక్‌కు కంప్యూటర్ సీటు వస్తుందా? లేదా? అనే ఆందోళనతో యాజమాన్య కోటా సీట్లను రిజర్వు చేసుకుంటున్నారు. కన్వీనర్ కోటాలో సీటు వస్తే ముందుగా చెల్లించిన డబ్బులు తిరిగి ఇచ్చేలా యాజమాన్యంతో మాట్లాడుకుంటున్నారు. కొంతమేరకు ఆర్థిక స్థోమత గల విద్యార్థులంతా యాజమాన్య సీట్లపైనే దృష్టి సారించారు. దీనంతటికీ కౌన్సెలింగ్ జాప్యమేనని అభ్యర్థులు వాపోతున్నారు. తల్లిదండ్రులు లక్షలాది రూపాయలు బయట వడ్డీలకు తెచ్చి...ఇంజనీరింగ్ సీట్ల కోసం అవస్థలు పడుతున్నారు.

ముందస్తు ప్రణాళిక కరువు

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌పై ఉన్నత విద్యాశాఖ ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తోంది. తెలంగాణలో ఇప్పటికే కౌన్సెలింగ్ ప్రారంభమవ్వగా, ఏపీలో ఆ ముచ్చటే కనిపించడం లేదు. తెలంగాణతో తమకు సంబంధం లేదంటూ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఐఐటీ, ఎన్‌ఐటీ ప్రవేశాలు పూర్తవ్వడానికి నెలకుపైగా పడుతుంది. ఈలోగా ఏపీలో డిగ్రీలో ప్రవేశాలకు ప్రకటన జారీజేశారు. వాటికి కూడా వెబ్ ఆప్షన్లు, కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తవ్వడానికి మరో నెల పడుతుంది. దీని ఆధారంగా ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ వెబ్ ఆప్షన్ల షెడ్యూలు ఈ నెలాఖరు లేదా ఆగస్టు మొదటి వారంలో వచ్చే అవకాశాలున్నాయి.

ఏపీ ఈఏపీసెట్‌ను తెలంగాణకు చెందిన 20వేల మంది విద్యార్థులు రాశారు. వారిలో చాలామంది ఇక్కడ పేరొందిన ప్రైవేట్ కళాశాలల్లో ఇంజినీరింగ్ సీట్లు పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏపీలో కౌన్సెలింగ్ ప్రారంభించనందున తెలంగాణ కళాశాలల్లో చేరుతున్నారు.

యేటా ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ కోసం అభ్యర్థులు పడిగాపులు పడాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ఏ రాష్ట్రంలో లేనంతగా ఏపీలోనే ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ జాప్యంపై అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కౌన్సెలింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

ముందస్తు వలసలు

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం. ఇప్పటికే వైసీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు పార్టీని వీడారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, గుంటూరు జిల్లా చెందిన ఉండవల్లి శ్రీదేవిని ఆ పార్టీ సస్పెండ్ చేసింది. వారిలో కోటంరెడ్డి, ఆనం, చంద్రశేఖర్‌రెడ్డిలు టీడీపీకి దగ్గరయ్యారు. ఉండవల్లి శ్రీదేవి ఇప్పటికీ మౌనంగానే ఉన్నారు. ఈ పరిణామాలతో వైసీపీ కోట బీటలు వారనుందని భావిస్తున్నారు. మరోపక్క వైసీపీలో టికెట్లు లభించని వారంతా టీడీపీ, బీజేపీలోకి వెళ్లేందుకు దారులు వెతుకుంటున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన మధ్య పొత్తులపై స్పష్టత వస్తే, వారి చేరికలపైనా స్పష్టత వచ్చే అవకాశముంది.

వైసీపీ వ్యూహాలపై సొంత ఎమ్మెల్యేల్లో ఆగ్రహం

వైసీపీ వ్యూహాలపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే ఆగ్రహంగా ఉన్నారు. ఐ ప్యాడ్ సర్వేల ఆధారంగా వైసీపీ ముందుకెళ్తోంది. అది వారికి మింగుడు పడటం లేదు. హిందూపురం వైసీపీ నూతన ఇన్‌చార్జ్‌గా దీపికారెడ్డిని నియమించారు. ఇప్పటివరకు అక్కడ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఇక్బాల్‌ను ఆ పదవి నుంచి ఆధిష్ఠానం తొలగించింది. దీనిపై మాట్లాడేందుకు ఇటీవల ఆయన సీఎం జగన్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరినా దక్కలేదు. దీంతో ఇక్బాల్ ఆధిష్ఠానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఇటీవల జరిగిన ప్రాంతీయ, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల సమావేశానికి సైతం హిందూపురం ఇన్‌చార్జ్ హోదాలో ఆమె రావడం చర్చనీయాంశమైంది. ఎన్నో ఏళ్ల నుంచి హిందూపురం టీడీపీకి కంచుకోటగా మారింది. అక్కడి నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా బాలకృష్ణ రెండు విడతలుగా గెలుపొందారు. ఈ సారి ఎలాగైనా హిందూపురంలో పాగా వేసేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో వేచి చూడాలి. గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ వైసీపీలోకి వెళ్తారని, చిత్తూరుజిల్లా నుంచి ఎమ్మెల్యేగా ఆయన బరిలో ఉంటారని సమాచారం. కొంతకాలం నుంచి టీడీపీకి ఆయన దూరంగా ఉంటున్నారు. గుంటూరు ఎంపీ బరిలోకి అంబటి రాయుడును వైసీపీ రంగంలోకి దించనుంది. ఇప్పటికే రాయుడు గుంటూరు పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తున్నారు. కాపు సామాజిక ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం, ఆయన తనయుడు వైసీపీలోకి వచ్చేందుకు రంగం సిద్ధమైనట్లు ఆ పార్టీ నేతలు సంకేతాలిస్తున్నారు. అదును చూసుకుని ఆయన కుటుంబం వైసీపీలోకి రానుంది. దానిపై ముద్రగడ ఇంతవరకు స్పందించలేదు. ఇటీవల పవన్ కల్యాణ్‌కు, ముద్రగడ మధ్య లేఖల యుద్ధం నడిచింది. పరస్పరం విమర్శలు చేసుకున్న విషయం విదితమే. పవన్ కు పోటీగా కాపు సామాజిక వర్గం నుంచి ముద్రగడను వైసీపీ తెరపైకి తెచ్చే ప్రయత్నం ఆరంభించింది.

జనసేనలోకి చేరికలు

జనసేనలోకి వలసలు ప్రారంభమయ్యాయి. ప్రకాశంజిల్లాకు చెందిన ఆమంచి స్వాములు ఇటీవల పవన్ కల్యాణ్ అధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. అంతకుముందు భారీగా కార్ల ర్యాలీతో మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన విశాఖ ప్రాంతానికి చెందిన పంచకర్ల రమేష్‌బాబు సైతం జనసేన గూటికే చేరతారని సమాచారం. ఉభయగోదావరి జిల్లాల్లోని కాపు సామాజిక వర్గానికి చెందిన ద్వితీయ శ్రేణి నేతలు జనసేనలోకి వస్తారని తెలుస్తోంది. ఆ దిశగా ఆ పార్టీ నేతలు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటివరకు కేవలం పార్టీ శ్రేణులతోనే నెట్టుకొస్తున్న జనసేనలోకి ఒకరిద్దరు ముఖ్య నాయకులు రావడం..కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతోంది. మొత్తంగా ఎన్నికలు సమీపిస్తుండటంతో ముందస్తుగానే రాజకీయ పార్టీల హడావుడి ప్రారంభించాయి. ఏపీ బీజేపీ అధ్యక్షులిగా దగ్గుబాటి పురంధేశ్వరిని ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. దీంతో ఆమె పార్టీ బలోపేతానికి కృషి ప్రారంభిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, జనసేన పొత్తు అవకాశాలు అధికంగా ఉన్నాయి.

దీనిని దృష్టిలో ఉంచుకుని ఎన్డీయే సమావేశానికి జనసేన నాయకుడు పవన్ కల్యాణ్‌ను ఏపీ నుంచి ఆహ్వానించారు. అటు టీడీపీకి ఆహ్వానం పంపకపోవడం చర్చనీయాంశంగా మారింది.

బియ్యం ఎగుమతులపై నిషేధం?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభావాలను కలిగి ఉండవచ్చు. దేశంలోని కీలకమైన వరి పండించే ప్రాంతాలలో అసమాన వర్షపాతం పంపిణీ కారణంగా గత పది రోజుల్లో ధాన్యం ధరలు 20 శాతం వరకు పెరిగాయని ఇటీవలి మీడియా నివేదిక వెల్లడించింది. ప్రపంచ బియ్యం ఎగుమతుల్లో 40 శాతానికి పైగా వాటా కలిగి ఉన్న భారతదేశం, 2022లో 56 మిలియన్ టన్నులను రవాణా చేసింది. అయితే, తక్కువ నిల్వల కారణంగా, రవాణాలో ఏదైనా తగ్గింపు గత సంవత్సరం ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అనూహ్య వాతావరణ పరిస్థితుల కారణంగా ఇప్పటికే పెరిగిన ఆహార ధరలను మరింత తీవ్రతరం చేస్తుంది. కాగా, 'భారతదేశం అత్యంత చౌక ధరకు బియ్యం సరఫరా చేసే దేశం' అని రైస్ ఎగుమతిదారుల సంఘం (ఆర్ఈఏ) అధ్యక్షుడు బి.వి.కృష్ణారావు రాయిటర్స్‌తో అన్నారు. 'కొత్త కనీస మద్దతు ధర కారణంగా భారతీయ ధరలు పెరగడంతో ఇతర సరఫరాదారులు కూడా ధరలను పెంచడం ప్రారంభించారు' అని ఆయన చెప్పారు. 300 కోట్ల మంది కంటే ఎక్కువ మంది ప్రజలకు బియ్యం ప్రధానమైనది. దాదాపు 90 శాతం నీరు ఎక్కువగా ఉండే పంట ఆసియా నుంచి వచ్చింది. ఇక్కడ ఎల్ నినో వాతావరణ నమూనా కారణంగా సాధారణంగా వర్షపాతం తగ్గుతుంది. గత సంవత్సరం, ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తరువాత, భారతదేశం విరిగిన బియ్యం ఎగుమతులను నిషేధించింది. తెలుపు, గోధుమ బియ్యం రవాణాపై 20 శాతం సుంకాన్ని విధించింది. ప్రభుత్వం గోధుమలు, చక్కెర ఎగుమతులపై కూడా ఆంక్షలు విధించింది. ఆసియాలో బియ్యం ధరలు రెండేళ్లలో అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. ఎందుకంటే దిగుమతిదారులు నిల్వలను పోగుచేసుకున్నారు.

ఐదులో నాలుగు ఆత్మహత్యలే

(మొదటిపేజీ తరువాయి)

ఉండాలని సలహా సిఫార్సు చేస్తోంది. మానసిక ఆరోగ్య స్థాపన కోసం ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం కనీసం ఒక జైలును గుర్తించాలని కూడా ఇది సలహా ఇస్తుంది. ఈ నిబంధన ప్రకారం, జైలు వైద్య అధికారి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీల సంఖ్యపై త్రైమాసిక నివేదికను మానసిక ఆరోగ్య సమీక్ష బోర్డులకు (ఎంహెచ్‌ఆర్‌బీలు) పంపాల్సి ఉంటుంది. ఒక వార్తా కథనం ప్రకారం, త్రిపుర, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్- కేవలం మూడు రాష్ట్రాలు మాత్రమే ఎంహెచ్‌ఆర్‌బీలను ఏర్పాటు చేశాయి. మానసిక ఆరోగ్య సంరక్షణ (మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తుల హక్కులు) నియమాల షెడ్యూల్ ప్రతి 500 మంది ఖైదీలకు ఒక వైద్యుడు, ఇద్దరు నర్సులు, నలుగురు కౌన్సెలర్‌లను అందిస్తుంది. అయితే నివేదిక ప్రకారం, జులై 2021 నాటికి 21 రాష్ట్రాలు జైళ్లలో మనస్తత్వవేత్తలు లేదా మనోరోగ వైద్యులు లేరు. ప్రతి 16,503 మంది ఖైదీలకు ఒక సైకాలజిస్ట్ లేదా సైకియాట్రిస్ట్ ఉన్నారు. ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2022 ప్రకారం, జైళ్లలో క్వాలిఫైడ్ డాక్టర్ల ఖాళీలు 2019లో 37 శాతం నుంచి 2021లో 48 శాతానికి పెరిగాయి. 11 రాష్ట్రాల్లో 1,000 మంది ఖైదీలకు ఒక డాక్టర్ ఉండగా, మరో ఐదు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న జైళ్లలో వైద్యులు లేరని నివేదిక వెల్లడించింది. 2021లో దేశవ్యాప్తంగా 1,319 జైళ్లకు, 5.5 లక్షల మంది ఖైదీలకు 69 మంది సైకాలజిస్టులు లేదా సైకియాట్రిస్ట్‌లు మంజూరైనా కేవలం 33 మంది మనస్తత్వవేత్తలు మాత్రమే నిమగ్నమై ఉన్నారని నివేదిక పేర్కొంది. 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మానసిక వైద్యుల నియామకాలకు సంబంధించి ఎటువంటి నిబంధనలు పాటించడం లేదని తెలిపింది.

తెలంగాణాలో తొలిసారి వైద్య పరీక్షలు

ఆగస్టు 2018లో సంగారెడ్డి జిల్లా జైలులో ఖైదీల మానసిక ఆరోగ్యానికి సంబంధించి భారతదేశపు మొట్టమొదటి సైకలాజికల్ స్క్రీనింగ్‌ను తెలంగాణ జైలు శాఖ నిర్వహించింది. పరీక్షించిన వారిలో దాదాపు 25 శాతం మంది ఆందోళన కలిగి ఉన్నారు. 51 శాతం మంది ఉన్మాదంతో బాధపడుతున్నారు. ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్) సెంటర్ ఫర్ క్రిమినాలజీ అండ్ జస్టిస్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ రాఘవన్, న్యాయపరమైన, పునరావాస న్యాయాన్ని అందించే ఫీల్డ్ యాక్షన్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రయాస్... ఎన్‌హెచ్‌ఆర్‌సీ వంటి 'ముఖ్యమైన సంస్థ' ఖైదీలు ఎదుర్కొన్న మానసిక ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకోవడం 'మంచి మొదటి అడుగు' అని వివరించారు. సీహెచ్‌ఆర్‌ఐ జైలు సంస్కరణల కార్యక్రమం ప్రధానాధికారి మధురిమ ధనుక మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ సలహాను 'స్వాగతించే చొరవ' అని కూడా అభివర్ణించారు. ప్రత్యేకించి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీల సంఖ్య 2015లో 5,203 మంది నుంచి 2021 నాటికి 9,180 మందికి పెరిగిందని గణాంకాలు పేర్కొంటున్నాయి. మొదటి స్థాయిలో ఖైదీలను క్రమం తప్పకుండా గమనించాలని, స్నేహితులు, కుటుంబ సభ్యులతో వారి టెలిఫోనిక్ సంబంధాన్ని నిర్ధారించాలని ఇది సిఫార్సు చేస్తుంది. ప్రతి జైలులో తగిన సంఖ్యలో టెలిఫోన్‌లను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. రెండవ స్థాయిలో అధిక ముప్పు కలిగిన ఖైదీలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ అందించే ప్రాంగణాలకు మార్చాలని, ఆత్మహత్యకు ఉపయోగించే ఏదైనా సామగ్రి లభ్యతను నిరోధించాలని, దర్యాప్తు కోసం ఆత్మహత్యకు ప్రయత్నించిన ప్రదేశాన్ని సురక్షితంగా ఉంచాలని సలహా సిఫార్సు చేస్తుంది. అలాగే, ఖైదీల మద్యం వ్యసనం సమస్యపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ మానసిక ఆరోగ్య సంరక్షణ నిపుణులు, డి-అడిక్షన్ నిపుణులను క్రమం తప్పకుండా సందర్శించాలని సలహా ఇవ్వడంతో పాటు ఈ సమస్యను ఆరోగ్యం, పునరావాసానికి సంబంధించిన అంశంగా చూడాలనేగానీ, భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించకూడదని సూచించింది. మానసిక క్షీణత సంకేతాలను గుర్తించడానికి, జైలు ఖైదీలకు ప్రత్యేక సేవలను అందించడానికి పారామెడికల్ సిబ్బంది, శిక్షణ పొందిన సామాజిక కార్యకర్తలను నిమగ్నం చేయవలసిన అవసరాన్ని డాక్టర్ రాఘవన్ నొక్కి చెప్పారు. ఖైదీల మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి పౌర సమాజాన్ని భాగస్వామ్యం చేయవలసిన అవసరాన్ని మధురిమ ధనుక అంగీకరించారు. 'ఖైదీలు ఇకపై మన సమాజంలో భాగం కాదని జైలు గోడలు మమ్మల్ని ఒప్పించకూడదు' అని ఆమె అన్నారు.

యదేచ్ఛగా తుపాకీ లైసెన్సులు!

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేసిన 1,30,914 తుపాకీ లైసెన్స్‌లతో దేశంలోనే అగ్ర స్థానంలో ఉంది. ముఖ్యంగా, నిషేధం అమలులో ఉన్నందున లైసెన్సులు 2016 నుంచి 2018 మధ్య, తరువాత జనవరి 2023 నుంచి జూన్ 2023 వరకు మాత్రమే జారీ అయ్యాయి. 3,69,191 లైసెన్స్ దారులను సూచించిన డిసెంబరు 2016 నుంచి చివరిగా అందుబాటులో ఉన్న గణాంకాలతో పోలిస్తే, కేంద్ర పాలిత ప్రాంతం తుపాకీ లైసెన్స్ దారుల మొత్తం సంఖ్య ఇప్పుడు 5,00,105 కి చేరుకుంది. దాదాపు ఐదేళ్ల నిషేధం ఉన్నప్పటికీ, కేంద్ర పాలిత ప్రాంతంలో తుపాకీ లైసెన్స్‌ల సమస్య గణనీయంగా పెరగడాన్ని ఎలా వివరించగలరని 'ది వైర్' జమ్ముకశ్మీర్‌లోని రాజ్‌భవన్‌ను ప్రశ్నించింది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమాచార హక్కు చట్టం అభ్యర్థనలో 'ది వైర్' దేశంలోని ప్రతి రాష్ట్రంలో లైసెన్స్ పొందిన తుపాకులను కలిగి ఉన్న వ్యక్తుల సంఖ్యపై సంవత్సరాల వారీ గణాంకాలను కోరింది. ఆత్మరక్షణ, వృత్తిపరమైన అవసరాలు, స్పోర్ట్స్ షూటింగ్ మొదలైన వాటికి సంబంధించిన లైసెన్సులు, రాష్ట్రాల వారీగా ఒక్కో విభాగంలో జారీ చేసిన లైసెన్సుల సంఖ్య వంటి తుపాకీ లైసెన్సుల వర్గీకరణను కూడా కోరింది. అయితే ప్రతి రాష్ట్రంలో జారీ చేయబడిన తుపాకీ లైసెన్స్‌ల వివరాలు మాత్రమే అందిన ప్రతిస్పందన. ఈ ఏడాది జూన్ 20 నాటికి దేశవ్యాప్తంగా 37.7 లక్షల క్రియాశీల తుపాకీ లైసెన్స్‌లు ఉన్నాయని తేలింది. ఇది చివరిసారిగా సమాచారాన్ని బహిరంగంగా అందుబాటులో ఉంచిన డిసెంబరు 2016లో క్రియాశీలంగా ఉన్న లైసెన్స్‌ల కంటే 4 లక్షలకు పైగా ఎక్కువ. ముఖ్యంగా దేశంలో అత్యధిక సంఖ్యలో తుపాకీ లైసెన్సులు ఉన్న ఏకైక కేంద్ర పాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్ కాగా, లక్షద్వీప్‌లో జీరో లైసెన్స్‌లు ఉన్నాయి.

అగ్రస్థానం యూపీదే

మరోవైపు, తుపాకీ లైసెన్స్ దారుల సంఖ్య పరంగా ఉత్తరప్రదేశ్ తర్వాత జమ్ముకశ్మీర్ రెండవ స్థానంలో ఉంది. ఉత్తర ప్రదేశ్‌లో ప్రస్తుతం 1,329,584 మంది లైసెన్స్ దారులు ఉన్నారు. 1,277,914 లైసెన్స్ దారులను నివేదించిన చివరిగా అందుబాటులో ఉన్న సమాచారం నుంచి ఈ సంఖ్య కూడా పెరిగింది. ఫలితంగా 51,670 తేడా వచ్చింది. ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ హయాంలో 51,670 లైసెన్సులు జారీ అయ్యాయి. యూపీలోని లైసెన్సుల జారీని 2018 వరకు నిషేధించారు. అక్టోబరు 2013లో అలహాబాద్ హైకోర్టులో జస్టిస్ అబ్దుల్ మతీన్, జస్టిస్ సుధీర్ కుమార్ సక్సేనాతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పోలీసు బలగాలు కలిగి ఉన్న ఆయుధాల సంఖ్య కంటే వ్యక్తులకు జారీ చేసిన ఆయుధాల లైసెన్సుల సంఖ్య ఐదు రెట్లు ఎక్కువ అని గమనించింది. రాష్ట్రంలో 2,25,000 ఆయుధాలతో కూడిన 2,13,000 మంది సిబ్బంది ఉన్నారని ధర్మాసనం గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వం 11.23 లక్షల ఆయుధ లైసెన్స్‌లను జారీ చేసింది. నిషేధం తర్వాత కూడా డిసెంబరు 2016లో ఆ సంఖ్య మళ్లీ 1,277,914 కి పెరిగింది. అయితే కోర్టు 2017 నవంబరులో నిషేధాన్ని ఎత్తివేసింది. ప్రస్తుతం, రాష్ట్రంలో పురుష, మహిళా పోలీసులు 2,50,000 మంది ఉన్నారు. రాష్ట్రంలో మొత్తం 1,329,584 లైసెన్స్‌లు జారీ అయ్యాయి. ఉత్తర ప్రదేశ్‌లో మూడవ అత్యున్నత ర్యాంకింగ్ పోలీసు అధికారిగా పని చేసిన సర్వన్ రామ్ దారాపురి మాట్లాడుతూ జమ్ముకశ్మీర్, యూపీ వంటి రాష్ట్రాల్లో అత్యధికంగా తుపాకీ లైసెన్స్‌లు ఉండటం ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. 'బీజేపీ ప్రభుత్వాలు ఎల్లప్పుడూ శాంతిభద్రతల పరిస్థితులపై తమ నియంత్రణ గురించి మాట్లాడుతాయి. అలాంటప్పుడు తుపాకీ లైసెన్స్‌ల పెరుగుదల ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్‌సీబీ) తాజా గణాంకాల ప్రకారం, ఆయుధాల చట్టం-1959 ప్రకారం ఉత్తర ప్రదేశ్‌లో 2021లో 36,363 కేసులు నమోదయ్యాయి. గ్యాంగ్‌స్టర్, మాజీ రాజకీయ నాయకుడు అతిక్ అహ్మద్ ఇటీవల పోలీసు కస్టడీలో ఉన్నప్పుడు అతని సోదరుడితో పాటు కాల్చి చంపబడ్డాడు. ఆ తర్వాత, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత యూపీలో తుపాకీ సంబంధిత హింస పెరిగిందని, ఇది అత్యధిక స్థాయికి చేరుకుందని 'ది ప్రింట్' వార్తా సంస్థ కథనం నివేదించింది.

ఎంపీలో లంచానికి బదులు తుపాకీ లైసెన్స్‌లు

గతంలో ఆయుధాల చట్టం కింద నమోదయిన కేసుల్లో మధ్య ప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు రెండో స్థానానికి పడిపోయింది. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్... మధ్యప్రదేశ్ హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా రూ.5 లక్షల లంచానికి బదులుగా తుపాకీ లైసెన్స్‌లు ఇచ్చారని ఆరోపించారు. అయితే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఈ ఆరోపణ గురించి మిశ్రాను ప్రశ్నించగా, 'ప్రక్రియ పారదర్శకంగా ఉంది. మీకు ఏవైనా ఆధారాలు ఉంటే చూపించండి?' అని ఎదురు దాడి చేశారు. 'ది వైర్'కి అందిన ఆర్టీఐ ప్రతిస్పందన ప్రకారం ప్రస్తుతం మధ్య ప్రదేశ్‌లో 282,675 మంది లైసెన్స్‌లను కలిగి ఉన్నారు. ఇది 2016లో 247,130 మంది చివరిగా అందుబాటులో ఉన్న సంఖ్య కంటే 35,545 మంది పెరిగింది.

నాగాలాండ్ నుంచి ఇతర రాష్ట్రాల వారు కూడా...

నాగాలాండ్ కేసు ఎంత ముఖ్యమైనదో కూడా దారాపురి ఎత్తి చూపారు. అక్కడ 44,473 మంది వ్యక్తులు ఆయుధాలు కలిగి ఉన్నారు. 'నాగాలాండ్‌లో తుపాకీ లైసెన్స్ పొందడం చాలా సులభం. ఇది తుపాకీ లైసెన్స్‌లను కలిగి ఉన్న రాష్ట్ర నివాసితుల సంఖ్యను వివరిస్తుంది. ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా నాగాలాండ్ ద్వారా వారి లైసెన్స్‌ల ఆమోదం పొందారు. 'ది వైర్'తో మాట్లాడుతూ, మణిపూర్ మాజీ పోలీసు కమిషనర్ రాజ్ కుమార్ నిమాయ్ కూడా గణాంకాలకు సంబంధించిన ఆందోళనలను లేవనెత్తారు. 'అధికారం నుంచి ఒత్తిడి లేకుండా, అంత పెద్ద సంఖ్యలో ఆయుధాలు కావు' అని ఆయన అన్నారు.

పంజాబ్ సంగతి మరోలా...

పంజాబ్ కొందరికి 'తుపాకీ ఒక హోదా చిహ్నం' అనే వాస్తవాన్ని ఉదహరించారు. పౌరుడి భద్రత రాష్ట్ర బాధ్యత అయినప్పటికీ ఈ రాష్ట్రాలు పాకిస్తాన్‌తో సరిహద్దులను పంచుకోవడం మరో కారణం కావచ్చని, అందువల్ల పౌరులు తమ భద్రత గురించి ఆందోళన చెందవచ్చని దారాపురి అన్నారు. 2016 గణాంకాలతో పోలిస్తే, బీహార్‌లో మాత్రమే తుపాకీ లైసెన్స్‌ల సంఖ్య 1,069 తగ్గింది. డిసెంబరు 2016లో 82,585 నుంచి ఇప్పుడు 81,516కి పడిపోయింది.

రైతులు, శ్రామికుల రక్షణ కోరుతూ

30న విజయవాడలో రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కేంద్రంలోని మోదీ ప్రభుత్వ కార్పొరేట్ దుష్పరి పాలన నుంచి రైతులను, శ్రామికులను కాపాడాలని కోరుతూ ఈనెల 30న విజయవాడలోని పి.బి.సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ సమగ్ర పంటలన్నింటికీ పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి (సి2+50శాతం) చట్టబద్ధ కనీస మద్దతు ధరలు నిర్ణయించాలని, రైతులు, పేదల పాలిట ఉరితాడు లాగా ఉన్న విద్యుత్ బిల్లును పార్లమెంటులో ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ పంపు సెట్లకు ప్రీ పెయిడ్ స్మార్ట్ విద్యుత్ మీటర్లను బిగించరాదని డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ రైతుల పంటల రుణాల బకాయిలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేరళ తరహాలో రైతు రుణ ఉపశమనం చట్టం తీసుకురావాలని, తద్వారా రైతుల ఆత్మ హత్యలను అరికట్టాలన్నారు. కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికుల హక్కులను పునరుద్ధరించాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని, డిస్కమ్‌లు, విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్లు తదితర అనేక ప్రభుత్వ రంగ సంస్థలను మానిటైజేషన్ పేరు మీద కారు చౌకగా అమ్మరాదని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈనెల 30న ఉదయం 10 గంటలకు రాష్ట్ర సదస్సు జరుగుతుందని, రైతు సంఘాల జాతీయ నాయకులు అనేక మంది హాజరవుతారని, రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ విభజన చట్టంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్మాణం చేస్తుందని చేస్తున్నప్పటికీ, మోదీ ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసానికి అయ్యే ఖర్చును రాష్ట్రమే ప్రభుత్వమే భరించాలని అనటం అన్యాయమని అన్నారు. రైతు కూలీ సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపు, వరికిపూడిశిల, గుండ్రేవుల తదితర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోరారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి చిటిపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దిల్లీ రైతు ఉద్యమ సందర్భంగా అశువులు బాసిన 750 మంది రైతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని, లఖింపూరీ ఖేరీ ఘటనలో ప్రధాన నిందితుడైన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను ప్రభుత్వం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న అనేక అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు పి.జమలయ్య, కుర్రా నరేంద్ర, వి.కృష్ణయ్య, జెట్టి గురునాథరావు, ఎం.గిరీష్, ఎం.హరిబాబు, గుమ్మడివరపు ఉమామహేశ్వరరావు, లంక కృష్ణమూర్తి, కళ్లం రాజశేఖర్ రెడ్డి, తూమాటి శివయ్య, మరీదు ప్రసాదు, కాసాని గణేష్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, వి.నరసింహారావు, సింగోతు నాగేంద్ర, వి.దుర్గాప్రసాద్, పి.వి.ఆంజనేయులు, కె.అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత

విశాలాంధ్ర-విశాఖ: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ప్రతినెలా 5వ తేదీలోగా గౌరవ వేతనాలు చెల్లించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత డిమాండ్ చేశారు. విశాఖ, విజయనగరం జిల్లాల సదస్సు విశాఖలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఆదివారం అనురాధ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ ప్రభుత్వాలు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు అతి తక్కువ గౌరవ వేతనాలు ఇస్తూ వెట్టి చాకిరీ చేయిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ పథకాల అమలు, నిరుపేద గర్భిణీలు, బాలింతలు, సున్నా నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు సేవలందించేందుకు వీరు శ్రమకోర్చి పని చేస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ భారమై అప్పులు తెచ్చి కేంద్రాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగైదు నెలల నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ బిల్లులు, విద్యుత్ బిల్లులు, సెంటర్ అద్దెలు, ఈవెంట్ బిల్లులు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తోందని, తక్షణం అన్ని బిల్లులూ చెల్లించాలని డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రంలో 20 నెలల నుంచి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు 30 శాతం పీఆర్సీ పెంచి చెల్లిస్తున్నారని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి తాను సీఎం అయిన తర్వాత అంగన్‌వాడీ వర్కర్లకు పొరుగు రాష్ట్రం కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తానని చెప్పి, నేడు వారి కంటే తక్కువ గౌరవ వేతనం చెల్లిస్తున్నారని విమర్శించారు. 15వ తేదీ దాటినప్పటికీ జూన్ గౌరవ వేతనాలు ఇంకా చెల్లించలేదని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ నేటికీ గ్రాట్యూటీ అమలుకు నోచుకోలేదన్నారు. అనేక సార్లు ప్రిన్సిపల్ కార్యదర్శి, కమిషనర్, మంత్రికి వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ వేతనాల పెంపుగానీ, గ్రాట్యూటీగానీ అమలుకాలేదని చెప్పారు. తక్షణం అంగన్‌వాడీ అసోసియేషన్ల నాయకత్వాలను జగన్‌మోహన్ రెడ్డి ఆహ్వానించి సమస్యలను చర్చించాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచి ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. విధులలో చనిపోయిన వారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని, వారి ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్ అయినవారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వాలని, రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో ఇతర సంఘాలను కలుపుకొని తీవ్ర పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అంగన్‌వాడీ సెంటర్లకు కావలసిన సామాగ్రిని ప్రభుత్వం తక్షణం సరఫరా చేయాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణకు నాణ్యమైన కిట్లు ఇవ్వాలని, బియ్యం, పప్పు, ఆయిల్ నాణ్యమైనవి సరఫరా చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నాసిరకం గుడ్లను వైసీపీ నాయకులే సరఫరా చేస్తున్నారని విమర్శించారు.

కమిటీల ఎన్నిక: ఈ సమావేశంలో రెండు జిల్లాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖపట్నం కమిటీ అధ్యక్షులుగా అనిత, ఉపాధ్యక్షులుగా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా అనురాధ, సహాయ కార్యదర్శిగా అరుణ, కోశాధికారిగా నరసాయమ్మ, కమిటీ సభ్యులుగా కుమారి, విజయ, కొండమ్మ, సీత ఎన్నికయ్యారు. విజయనగరం జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులుగా ఈగల అప్పలరాజు, అధ్యక్షులుగా రమణి, ఉపాధ్యక్షులుగా మణి, కార్యదర్శిగా మాణిక్యం, సహాయ కార్యదర్శిగా సుశీల, కోశాధికారిగా రమణ, కౌన్సిల్ సభ్యులుగా కుమారి, సరోజిని, యశోద, కనక మహాలక్ష్మి, హైమావతి ఎన్నికయ్యారు. సుమారు 50 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శ్రామిక గర్జన జయప్రదం చేయండి

రవీంద్రనాథ్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: పాలకుల విధానాలను నిరసిస్తూ ఆగస్టు 9వ తేదీన విజయవాడలో నిర్వహించే శ్రామిక గర్జన, మహా పడావ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావుల రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా ఏఐటీయూసీ కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన మోదీ అధికారం చేపట్టిన తరువాత ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బడా పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెట్టి ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రైల్వే, బొగ్గు గనులు, విమానాశ్రయాలు, పోర్టులు, రక్షణ రంగం, బీఎస్ఎన్ఎల్ లాంటి కీలకమైన సంస్థలను ప్రైవేటుపరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 32 మంది ఆత్మబలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తుంటే ఏఐటీయూసీ తీవ్రంగా నిరసిస్తూ అనేక ఆందోళనలు నిర్వహించిందన్నారు. దేశంలోని 12 కేంద్ర కార్మిక సంఘాలు, 450 స్వతంత్ర ఫెడరేషన్లు ప్రైవేటీకరణకు నిరసనగా, మోదీని రాబోయే ఎన్నికలలో గద్దెదించడానికి వివిధ రూపాలలో ఆందోళనలు, సదస్సులు నిర్వహించడానికి జాతీయ పోరాట కమిటీ కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యానికే తీవ్రముప్పుగా మారిన మోదీ సర్కారును సాగనంపడానికి ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ మోదీ... సేవ్ ఇండియా నినాదంతో విజయవాడలో జరిగే మహాధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో కార్మికులకు కనీసం తిండి తినడానికి కూడా అవకాశం లేకుండా నిత్యావసర ధరలు విపరీతంగా పెంచారని , కార్మికుల వేతనాలు పెంచకుండా ఉన్న సౌకర్యాలను కుదిస్తూ తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కడప-బెంగళూరు రైల్వే లైన్

రాయచోటి, మదనపల్లి మీదుగా నిర్మించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: కడప నుంచి రాయచోటి, మదనపల్లి మీదుగా బెంగళూరుకు రైల్వే లైన్ నిర్మించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఇక్కడి అనీబీసెంట్ సర్కిల్ వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారి నుద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ కడప -బెంగుళూరు రైల్వేలైన్‌ను రాయచోటి, మదనపల్లి మీదుగా నిర్మించాలని డిమాండ్ చేశారు. రాయచోటి ప్రాంతంలో ఉపాధిలేక బయట ప్రాంతాలకు వలసలు పోతున్నారని, మదనపల్లి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నా ఇక్కడి ప్రజలు వ్యాపారం, విద్య, ఉద్యోగాలు కోసం బెంగుళూరు పైన పూర్తిగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ రైల్వే లైన్ నిర్మించడం వల్లా వేలాది మందికి ఉపాధి కలుగుతుందని, ఈ రైల్వేమార్గం నిర్మాణానికి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి పద మూడు సంవత్సరాలు గడిచినా ప్రారంభానికి నోచుకోలేదనీ, ఇప్పుడు జగన్ రైల్వేలైన్‌ను పులివెందుల మీదుగా మారుస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం మదనపల్లి ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసిందని, కనీసం రైల్వే లైన్ అయినా మదనపల్లి మీదుగా నిర్మిస్తే ఈ ప్రాంతానికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. మదనపల్లి ప్రాంతానికి పదే పదే అన్యాయం జరుగుతున్నా, ప్రజాప్రతినిధులు ఈ ప్రాంత ప్రయోజనాల గురించి పట్టించుకునే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి కృష్ణప్ప, సాంబ, నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి, దేవ, తిరుమల, సూరి, శోభ, రెడ్డెప్ప, రవి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణపై మేజర్ పోర్టులు, ఫెడరేషన్ల మధ్య చర్చలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మేజర్ పోర్టులు, ఫెడరేషన్ల మధ్య నాలుగో ద్వైపాక్షిక చర్చల కమిటీ సమావేశానికి విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆతిథ్యం ఇచ్చింది. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో మేజర్ పోర్టుల చైర్ పర్సన్లు, ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ (ఐపీఏ) చైర్‌పర్సన్ ఈ సమావేశానికి నేతృత్వం వహించారు. క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగుల వేతన సవరణ అంశాలను ఈ సమావేశంలో చర్చించారు. తొలుత విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అతిథులకు సాదర స్వాగతం పలికారు. విశాఖపట్నం పోర్టులో ఉద్యోగులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. ఉద్యోగులందరికీ సంక్షేమాన్ని సమానంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశానికి చేసిన ఏర్పాట్లపై ఫెడరేషన్ ప్రతినిధులు సంతృప్తిని వ్యక్తం చేస్తూ అంగముత్తును, వీపీఏ సిబ్బందిని అభినందించారు. వేతన సవరణ చర్చలు అర్థవంతంగా జరిగి, నిర్ణయాలను సమర్థంగా అమలు చేయటంలో తమ వంతు మద్దతు ఇస్తామని వెల్లడించారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి పటిష్ట చర్యలు

ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి రామిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో సీజనల్ వ్యాధులను కట్టడి చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ వేమిరెడ్డి రామిరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మలేరియా, డెంగ్యూ తదితర ఇతర వ్యాధులను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు అనేక చర్యలు తీసుకుంటున్నామని, మరింత అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అన్ని జిల్లాల మలేరియా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి, నాలుగేళ్లలో నమోదయిన మలేరియా పీడిత గ్రామాలను గుర్తించామన్నారు. ఇందులో భాగంగా దాదాపు 4.72 లక్షల జనాభా ఉన్న 1,969 గ్రామాలలో మలేరియా కారక దోమలను నియంత్రించేందుకు రెండు రౌండ్లు పిచికారి కార్యక్రమాన్ని నిర్దేశించామన్నారు. మొదటి విడతను ఏప్రిల్ 15 నుంచి జూన్ 30 నాటికి పూర్తి చేశామని వివరించారు. రెండో విడత ఈనెల 1 వ తేదీ నుంచి అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలలో మొదలుపెట్టామన్నారు. మిగతా జిల్లాలలో ఈనెల 15న ఇప్పటికే ప్రారంభించామని, ఆగస్టు 1వ తేదీ నాటికి ముగుస్తుందని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం, అవగాహన కోసం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. ఈ ఏడాది మొత్తం 35,22,451 మంది మలేరియా పీడితులుగా గుర్తించి పరీక్షలు చేయగా 1,630 మందికి మలేరియా సోకినట్టు వెల్లడయ్యిందని అన్నారు. మొత్తం 25.95 లక్షల లాంగ్-లాస్టింగ్ క్రిమిసంహారక వల్లని కేంద్ర ప్రభుత్వం సరఫరా చేయగా రాష్ట్రంలోని ఇతర మలేరియా ప్రాంతాలతో సహా మలేరియా ప్రమాదకర గిరిజన ప్రాంతాలలో పంపిణీ చేశామని డాక్టర్ రామిరెడ్డి వివరించారు. దోమల లార్వాల నివారణలో భాగంగా మత్స్య శాఖ సమన్వయంతో గుర్తించిన నీటి వనరులలో కోటి గంబూసియా చేపలను విడుదల చేసేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేశామన్నారు. స్ప్రే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ పీవోల పర్యవేక్షణలో డీపీవో, వ్యవసాయ, మత్స్య శాఖలు, ఎస్సీ కార్పొరేషన్, డీఎస్వో, డీఇవో, డీఎల్పీవో వంటి జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, ఉపాధి హామీ ఏపీవో, హౌసింగ్ ఏఈ అధికారులు సీజనల్ వ్యాధుల కట్టడికి పని చేస్తున్నారని తెలిపారు. డెంగ్యూ కారక ఏడీస్ దోమల పిల్లలను నియంత్రించేందుకు ఏఎన్ఎం, వలంటీర్లు ప్రతి వారం ఇంటింటికీ వెళ్లి ప్రజలలో ఏడీస్ దోమల వృద్ధిని అరికట్టే విషయంలో చైతన్యపరుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వంచే గుర్తించిన 54 సెంటినల్ సర్వేలెన్స్ ఆస్పత్రుల్లో డెంగ్యూ రోగ లక్షణాలున్న 40,194 సెరా శాంపిళ్లను పరీక్షించగా 2,329 డెంగ్యూ కేసులను గుర్తించామని తెలిపారు. 2019 నుంచి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద మలేరియా, డెంగ్యూకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చికిత్స అందిస్తోందని, ఇది సీఎం జగన్ కృషి కొనియాడారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ సీజనల్ వ్యాధులపై జిల్లా స్థాయి అధికారులతో ఈనెల 7న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణలో సమర్థవంతమైన ఇంటర్-సెక్టోరల్ సమన్వయం కోసం కలెక్టర్లు ప్రతి వారం అన్ని జిల్లా స్థాయి అధికారులతో జిల్లా సమన్వయ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ ఏడాదిలో మలేరియా, డెంగ్యూకు సంబంధించి పరీక్షలు, రోగనిర్ధారణ చర్యలు పెరిగాయని వేమిరెడ్డి రామిరెడ్డి వివరించారు.

అసైన్డ్ భూముల చట్ట సవరణపై పునరాలోచించాలి

సీఎం జగన్‌కు సీపీఎం లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: అసైన్డ్ భూముల ముసాయిదా చట్ట సవరణలో చేసిన మార్పులు అభ్యంతరకరంగా ఉన్నాయని, ఆయా అంశాలపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. ఈ నెల 12న మంత్రివర్గ సమావేశంలో పేదలకు భూ పంపిణీ చేస్తామని, అదే సమయంలో అసైన్డ్ భూములపై యాజమాన్యపు హక్కు కల్పిస్తామని నిర్ణయించారని తెలిపారు. అయితే ఈ నిర్ణయం వల్ల అసైన్డ్ భూములు పొందిన నిజమైన దళితులు, ఇతర పేదలకు నష్టం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక భాగం అసైన్డ్ భూములు పేదల చేతుల నుంచి జారిపోయి ధనవంతుల చేతుల్లోకి మారాయని, ఈ భూములన్నింటినీ అసలు లబ్ధిదారులైన పేదలకు బదలాయించాలన్నారు. అదేవిధంగా పేదలకు పంచడానికి లక్షలాది ఎకరాలు ఉన్నట్లు గతంలో కోనేరు రంగారావు భూ కమిటీ చెప్పిందని, అలాగే రాష్ట్రంలో సుమారు 5 లక్షల మందికి పైగా దశాబ్దాలు తరబడి పేదలు స్థలాల్లో ఇళ్లు వేసుకొని పట్టాలు లేకుండా జీవనం సాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్లోనూ, ఇతర అనేక కాలనీల్లో దీర్ఘకాలంగా నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, దీనికోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యక్రమం రూపొందించి అమలు చేయాలని కోరారు. ఈ సమస్యపై నియమించిన ధర్మాన ప్రసాదరావు కమిటీ నివేదికను బహిర్గతం చేసి అనంతరం అన్ని పక్షాల అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. భూమి లేని పేదలకు 54 వేల ఎకరాలకు పైగా పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించటంపై హర్షం వ్యక్తం చేశారు. పేదలకు పంచడానికి ప్రభుత్వ భూములతో పాటు 16 రకాల భూములు సుమారు 25 లక్షల ఎకరాలకు పైగా ఉన్నట్లు కోనేరు రంగారావు కమిటీతో పాటు ప్రభుత్వ నివేదికలు కూడా చెబుతున్నాయని, ఆ భూములను కూడా పంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేదలు సుమారు 4 నుంచి 5 లక్షల మంది ప్రభుత్వ కాల్వగట్టు, రహదారుల పక్కన గ్రామ కంఠం, ఇతర స్థలాల్లో గుడిసెలు, నివాసాలు ఏర్పరుచుకొని జీవనం సాగిస్తున్నారని, వారికి హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

చేతివృత్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి
- సమాఖ్య ఏపీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్రంలో మూడవ వంతు జనాభా కలిగి ఉన్న చేతి వృత్తిదారుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి చేతివృత్తుల పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతిలో చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఎం.నారాయణ బాబు అధ్యక్షతన జిల్లా సమితి సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాన అధికారమంతా తమ సామాజిక వర్గానికి కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయని అన్నారు. బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించడానికి 56 కులవృత్తుల కార్పొరేషన్లను ఏర్పాటు చేసి చైర్మన్లను, పాలక వర్గ సభ్యులను నియమించారని తెలిపారు. అయితే హామీలు ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచి, పదవీ కాలం ముగిసినా ఒక్క పైసా కూడా కార్పొరేషన్లకు కేటాయించకుండా ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారని ధ్వజమెత్తారు. నూతన సాంకేతిక యంత్ర పరికరాలను చేతివృత్తుల దారులు కొనుగోలు చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని, ప్రభుత్వ ప్రోత్సాహం లేక చేతి వృత్తులను వదిలిపెట్టి అర్థాకలితో జీవిస్తున్నారని విమర్శించారు. గతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా పొందే సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా చేతివృత్తుల వారికి జగనన్న చేయూత పథకం ద్వారా డబ్బులు అందిస్తున్నానని చెప్పి అమలు కోసం పెట్టిన నిబంధనల వల్ల చేతి వృత్తిదారులకు సహాయం అందించకుండా మొండి చెయ్యి చూపించాడని విమర్శించారు. చేతివృత్తిదారుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి, వృత్తులను పరిరక్షించి, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఐక్య ఉద్యమాల ద్వారా తమ వృత్తులను పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి వరకు చేతివృత్తుల సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. సమాఖ్య పోరాటాలకు సీపీఐ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సీనియర్ నాయకులు సిహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ చేతివృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై వృత్తుల వారీగా అధ్యయనం చేయాలని, సమస్యల పరిష్కారం కోసం చేతి వృత్తిదారులందరూ సమన్వయంతో ఉద్యమించి సాధించుకోవాలన్నారు. చేతివృత్తుల దారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రామచంద్రయ్య మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ప్రజలకు సేవలు అందిస్తున్న 14 వృత్తులను గుర్తించి, ఆ వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళనకు సమాయత్తం కావాలని కోరారు. జులై 21న అనంతపురంలో జరిగే రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చేతివృత్తుల దారుల సమాఖ్య నెల్లూరు జిల్లా కార్యదర్శి సి.వి.చైతన్య, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు జయ సునీల్ కుమార్, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం నాయకులు శివకృష్ణ, టైలర్ల సంఘం నాయకులు రామ్మూర్తి, చర్మకారుల వృత్తిదారుల సంఘం నాయకులు బాల బాలకృష్ణ చంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలి

గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బోనాల పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, అంబర్ పేట్, విద్యానగర్ ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు దర్శించుకున్నారు. ఏపీ కాంగ్రెస్ నేతలతో కలిసి ఆదివారం బోనాల ఉత్సవాలలో పాల్గొన్న ఆయనకు సంబంధిత ఆలయ అధికారులు లాంఛనాలతో స్వాగతం పలికారు. తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని, రుద్రరాజు అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ బోనాల నిర్వహణ కమిటీ సభ్యులు గిడుగు రుద్రరాజుకు శాలువా కప్పి సత్కరించారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వేలాదిగా తరలి వస్తోన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని ఆలయాల కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

అనుబంధాలై పరిమళించే కవిత్వం

మనిషి మనిషికీ మధ్య ప్రాణవాయువు వంటి అనుభూతుల్ని నింపుతూ మనసుల్ని మురిపిస్తూ జీవితాలకు సార్థకత చేకూరుస్తుంటుంది అనుబంధం. అది ఎన్నెన్నో భావోద్వేగాల సమాహారం. ప్రేమైక జీవనానికి, వసుధైక జీవనానికి అది పాదులువేస్తూ వుంది. అనుబంధం ఎన్నెన్నో రాగాలను, అనురాగాలను పలికిస్తుంటుంది. ఎన్నెన్నో త్యాగాలను వొలికిస్తుంటుంది. అది ఆమనిలా మనిషి ఉద్యానంలో ఆశల పుష్పాల పరిమళాల్ని వెదజల్లుతూనే వుంటుంది. అనుబంధం మనిషి జీవితంతో అంతగా పెనవేసుకుపోయి అతడి హృదయస్పందన అయిపోయింది. అందుకే అతడి వెన్నంటే వుండే కవిత్వమూ ఆ అనుబంధానికి ఫిదా అయిపోయింది. తానే అనుబంధమై పోయి మనిషి హృదయస్పందనల అక్షరాలైపోతుంది. జీవితాల మధ్య అనుబంధాల వారధుల్ని నిర్మిస్తూ వుంటుంది. అది ఆకాశమైపోయి వెన్నెల లాంటి అనుబంధాన్ని వెదజల్లుతూవుంటుంది. మానవజీవన హర్మ్యాలలో అనుబంధాల తొలకరిజల్లుల్ని కురిపిస్తూ వుంటుంది. సృష్టిలో ఎన్నెన్ని వైవిధ్యమైన అనుబంధాలు?! అన్నింటినీ అక్షరీకరణ చేస్తూ మానవ కళ్యాణమే లక్ష్యంగా వాటిని హృదయంగమంగా తీర్చిదిద్దుతూవుంటుంది కవిత్వం.

'మేఘాలకు గంధం పూసి
స్వర్గానికి మీగడ రాసి
ఇంద్రలోకాన్ని తేనెలో ముంచి
అన్నీ కలిపి రంగరించి
ఒక మునకను తుంచి
మా ఇంటికి పంపారెవరో...
క్షమ గుక్కపట్టింది/ ఇంటిల్లిపాదీ
కన్నీటిపర్యంతం
క్షమ కేరింతలు/ ఇంటిల్లిపాదీ
నవ్వాపుకోలేక/ కేరింతలు...
పూల కోసం ఊరంతా తిరిగాం/ క్షమ వచ్చాక
మాలోలోపల/పూదోట విరబూత
మా ఇల్లొక సెలయేరు/ క్షమ విసిరిన గులకరాయి
ఎన్నెన్ని అల్లర్ల అలలు
క్షమ చేయి తిరిగిన శిల్పి/ మాలోపలి శూన్యాలను
శిల్పాలుగా చెక్కింది
(మన'వరాలు' దీర్ఘకవిత నుంచి)

అంటూ మనవరాలు క్షమ మీద అనుబంధ పరిమళాలలతో కూడిన కవితాపుష్పాలను వెదజల్లుతారు వర్తమాన కవి ప్రసేన్. ఒక ఇంటిలోని సభ్యుల జీవితాల్లోకి ఆడబిడ్డ ప్రవేశాన్ని అనుబంధాల సొబగులు తొడిగిన అక్షరాల తోరణాలతో స్వాగతించింది కవిత్వం. ఆడబిడ్డ పుడితే కాళ్లకింద అగ్నిపర్వతం బద్దలౌతున్నట్టు, తలపైన పిడుగు పడుతున్నట్టు కొన్ని జీవితాలు వెలవెలబోయే నేపథ్యంలో భ్రూణహత్యల్ని నిరసిస్తూ ఆడబిడ్డ నవ్వుతో మనసు పూలతోటలా విరబూసినంత హొయలుబోయింది కవిత్వం. ఆడబిడ్డ ఆగమనాన్ని మేఘంతోనూ, స్వర్గంతోనూ, ఇంద్రలోకంతోనూ మమేకం చేసింది. మనవరాలి కోసం తల్లడిల్లే ఒక తాతయ్య అనుబంధాల హృదయస్పందనల్ని ఆవిష్కరించింది. మనవరాలి అనుబంధాన్ని సెలయేరులో దర్శించింది. అందులో గులకరాయై అమె చేసే అలల అల్లర్లనూ వీక్షించింది. ఆ ఇంటిల్లిపాది హృదయాల శిలల్ని శిల్పాలుగా మలిచే శిల్పిగా మారిపోయింది ఆ మనవరాలి అనుబంధం. వారికి వరమైపోయింది. ఇక్కడ కవిత్వం అనుబంధపు లోతుల్ని ప్రకృతి ప్రతీకలతో సంలీనం చేస్తూ ఆ అనుబంధానికే వన్నె తెచ్చింది.

'అప్పుడప్పుడూ అరచేతుల్ని ముద్దాడుకోవాలి
వేలికొసలతో అరచేయి మాట్లాడే
సుతిమెత్తని భాషను ప్రేమించాలి
అరచేతిని పుస్తకంగా చదువుతూ
విడిపోని రేఖల్లా
అందరిలో కలిసిపోవడం నేర్చుకోవాలి...
అరచేతిని తాకడమంటే
బాల్యాన్ని ఎత్తుకోవడమే
అరచేతిని ముద్దాడడమంటే
పసిమనసుతో జీవించడమే
మనజీవితాన్ని దగ్గరకు తీసుకొని ముద్దాడడమే...
ఆత్మీయులు నిను వీడలేక
మళ్లీ మళ్లీ నీవైపే చూస్తున్నప్పుడు
ఓసారి వాళ్లచేతిని ముద్దాడిచూడు
ఒకరి అరచేతిని ముద్దాడడమంటే
అనుబంధాలను అల్లుకోవడమే'
('అరచేయి' ఖండిక నుంచి)

అంటూ అనుబంధాన్ని విలక్షణదృష్టితో ఆవిష్కరిస్తాడు వర్తమాన కవి తగుళ్ల గోపాల్. చైతన్య దుందుభికి ప్రతీక అయిన అరచేయి ఇక్కడ అనుబంధానికీ ప్రతీక అయిపోయింది. అరచేయిలోని అనుబంధాల రహస్యపు లోతుల్ని కవిత్వం పుక్కిట పట్టుకుంది. అది ఏ అనుబంధమైనా కావచ్చు. అరచేయిని ముద్దాడితే అక్కడ పుట్టే అనుబంధం జీవితానికి ప్రాణ వాయువు అయిపోతుంటుంది. అక్కడి విడిపోని రేఖలు అందరూ కలసిమెలసి వుండాలని వసుధైక మంత్రాన్ని పఠిస్తూవుంటాయి. ఆ మంత్రంతో కవిత్వమూ జతకట్టింది. అరచేయి పుస్తకమై అనుబంధాల పాఠాల్ని నేర్పుతుంటుంది. అరచేయి పర్యంతమూ బాల్యమంత సున్నితమైన అనుబంధాల్నే కలిగివుంటుంది. ఆ అనుబంధం మనల్ని మనమే సంస్కరించుకోవడానికి దోహదపడుతూవుంటుంది. అందుకే ఇక్కడ కవిత్వం అరచేయి అయిపోయింది. అరచేయిలోని జీవనమాధుర్యాల్నిభాష్యాలుగా చెబుతుంది. అరచేయి అనుబంధం ఇరువురి హృదయస్పందనల్ని మమేకం చేస్తుంటుంది. అనుబంధం అంటే బతుకుబండికి ఇంధనం. వీడిపోదు ఎప్పుడూ దాని తాజాదనం. అందుకే అనుబంధంతో అనుబంధాన్ని పెంచుకుంటుంది కవిత్వం. అనుబంధపు ఆమనిలో అది ఎప్పుడూ మానవ జీవన పరిమళాల్ని వెదజల్లే అక్షరాల సుమాల్ని పూయిస్తూనే వుంటుంది.

-డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, 9177732414

మహాకవికి మూడు ఏభైల పూదండ

గ్రంథ సమీక్ష

ఏదేదో ఊహా ప్రపంచంలో కొట్టుకుపోతూ, కొట్టుమిట్టులాడుతూ సమాజ కవితాలోకం ఊగిసలాడుతున్న సమయంలో ఒక ఉప్పెనలా వచ్చిన మహాప్రస్థాన గీతాలు, ఖడ్గసృష్టి విన్యాసాలు కవితా లోకాన్ని, ముఖ్యంగా యువ కవితా వలయాన్ని నిర్థిష్ట దృక్కోణం వైపు మళ్లించాయి. ఆ సృష్టికర్త శ్రీశ్రీ అనబడే శ్రీరంగం శ్రీనివాసరావు! దాదాపు '50వ దశకంనుంచి దూసుకొచ్చిన ఆ కవితా ఝరి అభ్యుదయ భావుకులను చైతన్య దృక్పథం వైపు నడిపించింది. ఒక రకంగా తోసేసింది. తను చదివిన సాహిత్యం, తన జీవితం, తన పరిసరాలు నేర్పిన, కూర్చిన భావజాలం శ్రీశ్రీని సామ్యవాద భావజాల కవిగా, అప్పటి సాహితీలోకం అభివర్ణించినట్లు విప్లవ కవిగా, మహాకవిగా ముద్రవేసింది. ఆ మహాకవి సాహితీ రంగంలో బహుముఖ విన్యాసాలు చేశాడు. కొత్త ప్రక్రియల్నీ చేసి చూపించాడు. అయితే అక్కడక్కడ,అప్పుడప్పుడు ఏవేవో పత్రికల్లో అచ్చు పడిన ఆ మహాకవి సాహిత్యాన్నంతటినీ శోధించి, ఏరి కూర్చి ఈ తరానికి, ముఖ్యంగా ఆధునిక కవితా లోకానికి, వాస్తవిక మరో ప్రపంచ రూపాన్ని చూడాలని కలలు కంటున్న, తపన పడుతున్న వారికోసం వివరంగా అందించాలన్న సదుద్దేశ్యంతో, నిబద్ధతతో సింగంపల్లి అశోక్ కుమార్ సారథ్యంలో ప్రారంభించిన "శ్రీశ్రీ సాహిత్య నిధి" తొలి ప్రయత్నంగా వంద పుస్తకాలను పాఠకలోకానికి అందించింది.

మలి ప్రయత్నంగా మరో వంద పుస్తకాలు అందించాలని తలపెట్టి ఇప్పటికి మరో నలభై పుస్తకాలను అందించింది. తాజాగా మేలో శ్రీశ్రీ వర్ధంతి రోజున మరో పది పుస్తకాలు ప్రచురించి ఆవిష్కరణ జరిపింది. శ్రీశ్రీని అభిమానించే, ఆయన శిష్యులనిపించుకునే వారు ఆరోజు, విజయవాడలో తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఉన్న శ్రీశ్రీ విగ్రహం ముందు ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆ పుస్తకాలు-1. శ్రీశ్రీ ప్రపంచం 9 (రూ.15/-), 2.అనితర సాధ్యం శ్రీశ్రీ మార్గం-కె.వి.ఆర్. (రూ. 100/-), 3. శ్రీశ్రీ ఆధునిక విమర్శకుడు-త్రిపురనేని (రూ. 65/-), 4. శ్రీశ్రీ గ్రంథపీఠికలు(రూ. 50/-), 5.జరుక్‌శాస్త్రి-శ్రీశ్రీ (రూ.40/-), 6. శ్రీశ్రీ ప్రపంచం 10 (రూ.15/-), 7. సాహిత్య సమవాకారం- తెన్నేటిసూరి (రూ.50/-), 8. శ్రీశ్రీ జీవితం-సాహిత్యం-కడియాల(రూ.40/-), 9. అంతర్యుద్ధం- ఆచార్య ఆత్రేయ(రూ.40/-), 10.చేరాత-చేకూరి రామారావు(రూ. 65/-).

"కవుల కవి అనదగిన వాడు శ్రీశ్రీ" అని ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు కె.వి. రమణారెడ్డి ఇచ్చిన కితాబు నూటికి నూరు పాళ్లా వాస్తవం. కవికి ఒక నిబద్ధత ఉండాలి. నా మటుక్కి నేను ఏదో రాసుకుంటూ పోతాను అనుకునే వారి వల్ల ఈ సమాజానికి ఏం ప్రయోజనం లేదు. "నూటికి నూరుపాళ్లా ప్రయోజన దృష్టితో కూడిన నిరంతర సాహిత్య దీక్ష, సాహిత్య జీవితాన్ని సమాజ జీవతంతోటి మలిచి రెండింటినీ మహితం చేయబూనిన చారిత్రక దృక్పథం ఇలాంటి విశేషాలన్నీ కలపి శ్రీశ్రీని ఉద్యమప్రాయుణ్ణి చేశాయి"- అన్న కె.వి. రమణారెడ్డి మాటలు అక్షర సత్యాలు. కనుకనే శ్రీశ్రీ జనకవిగా, మహాకవిగా చిరస్థాయిగా నిలిచాడు. అందుకే ఆయన అన్నారు-అనితర సాధ్యం శ్రీశ్రీ మార్గం-అని. ఈ పుస్తకంలో ఆయన శ్రీశ్రీ సాహిత్యాన్ని, శ్రీశ్రీ పైపడిన అనేకానేక ప్రభావాలనీ క్షుణ్ణంగా విశదీకరించారు.

మూడవ పుస్తకం శ్రీశ్రీని గురించి త్రిపురనేని మధుసూదనరావు చెప్పిన-"శ్రీశ్రీ- ఆధునిక విమర్శకుడు" లో శ్రీశ్రీ కవిత్వం నుంచి శ్రీశ్రీ సాహిత్య విమర్శని వేరు చేసి పరిశీలించడం సాధ్యం కాదంటారు. శ్రీశ్రీ కవిత్వంలో కనిపించే వైరుధ్యం, వైవిధ్యం శ్రీశ్రీ సాహిత్య విమర్శలో కూడా స్పష్టంగా కనిపిస్తుందంటారాయ. విమర్శ గురించి శ్రీశ్రీ-"యే ఆదర్శమూ లేకుండా విమర్శించడం శ్రేయస్కరం కాదు.....సంఘాన్ని ముందుకు నడిపించడమే విప్లవపంథా, అభ్యుదయ రీతి, ఇది కావ్య విమర్శకు గీటురాయి....... సామ్యవాద సమాజమే అభ్యుదయ రచయితల ధ్యేయం. అందుచేత అభ్యుదయ రచయితలంతా సామ్యవాదులే...." అంటారు శ్రీశ్రీ. రాళ్లపల్లి, విశ్వనాథ వంటి సంప్రదాయ విమర్శకులకి భిన్నమైన ఆధునిక విమర్శను శ్రీశ్రీ అభివృద్ధి చేశాడు-అని త్రిపురనేని వారు అంటారు. ఇక శ్రీశ్రీ గ్రంథపీఠికలు అన్న మరో పుస్తకంలో శ్రీశ్రీ మీద, ఆయన సినీ పాటలమీద, తదితర అంశాలపై వెలువరించిన పుస్తకాలను పురిపండావారు, చలం, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, ఎస్.పి.

ప్రతులకు: శ్రీశ్రీ సాహిత్య నిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతీనగర్, విజయవాడ. 520004. సెల్: 9246277375

బాలసుబ్రహ్మణ్యం, పి. సుశీల, ఎం.వి. రాయుడు అందించిన పీఠికలతో కూర్చినది.

తరువాత పుస్తకం "జరుక్ శాస్త్రి". ఇందులో ఏరి కూర్చినవి చదువుదామన్నా సాధారణంగా మనకెక్కడా దొరకవు. జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి గొప్ప పేరడీ కవి. ఈయన్ను శ్రీశ్రీ చనువుగా, ఆప్యాయంగా "రుక్కాయి" అని పిలుచుకునే వారు. అంతేకాదు తాను శ్రీశ్రీకి అనధికార పబ్లిసిటీ ఆఫీసరునని జరుక్ శాస్త్రిగారే స్వయంగా చెప్పుకునే వారు కూడా. "జరుక్ వాడుకలో ఒక వైభవం ఉండేది. కవిత్వాన్నే కాదు, వచనాన్ని కూడా అవలీలగా తిరగేసి తొడిగేసుకునే వాడు"-అని శ్రీశ్రీ కితాబిచ్చారు. తన 'మహాప్రస్థానం' కవితా సంకలనానికి చలంగారి చేత ప్రశంసా వాక్యాలు రాయించింది కూడా జరుక్ శాస్త్రే. శ్రీశ్రీ గీతాలన్నీ ఎక్కడెక్కడ అచ్చయినవీ సేకరించి ఒక నోటుపుస్తకంలో రాసుకుని జాగ్రత్త చేసింది కూడా జరుక్ శాస్త్రే! ఈ పుస్తకంలో రుక్కాయి కథలు, కృష్ణశాస్త్రి జ్ఞాపకాలు తదితర అంశాలున్నాయి.

ఇక తరువాత పుస్తకం 'శ్రీశ్రీ ప్రపంచం (సచిత్ర లఘు పత్రిక10)లో 'శ్రీశ్రీ అనంతంలోకి....మరోసారి' అంటూ కవి, కథకుడు, రచయిత, జర్నలిస్టు అయిన కలువకొలను రాంమోహనరాజు చేసిన 'అనంతం' మీద విశ్లేషణ ఉంది. 'అనంతం ఒక వైరుధ్యాల కుప్ప అనుకుంటే ఆ వైరుధ్యాలు శ్రీశ్రీలో కాక సమాజంలో ఉన్నాయంటారు రాంమోహనరాజు. అదే విధంగా 'శ్రీశ్రీ, విశ్వనాథ ఇద్దరూ భావకవిత్వంలోనే బయలుదేరినా, విశ్వనాథ భావకవిత్వం నుంచి జాతీయోద్యమ కవిత్వం ద్వారా తిరోగమన సాహిత్యంలోకి దూసుకు వెళ్లారు. శ్రీశ్రీ అదే భావకవిత్వం నుంచి అభ్యుదయోద్యమం ద్వారా విప్లవ కవిత్వంలోకి ప్రస్థానం చేశాడు' అంటారాయన. ఈ సునిశిత విశ్లేషణ ఆకళింపు చేసుకోవాల్సిన అవసరం ఉంది నేటి తరానికి.

ఆ తరువాత పుస్తకం 'సాహిత్య సమవాకారం"లో శ్రీశ్రీ మహాప్రస్థానంపై 1951లో 'ఆంధ్రప్రదేశ్' సంచికలో అచ్చయిన తెన్నేటి సూరి రాసిన తొలి సమీక్షా వ్యాసం అందించారు. అలాగే తేన్నేటి వారు రాసిన సంగీత వ్యంగ్య రూపకం 'సాహిత్య సమావాకరం' కూడా అందించారు. ఈ రూపకంలో శ్రీశ్రీ, గిరీశం, వెంకలేశం, ఆరుద్ర, దాశరథి, లక్ష్మీకాంతం ఆదితర పాత్రలున్నాయి.

"తెలుగు సాహిత్యానికి ఇరవైయవ శతాబ్ది వరం శ్రీశ్రీ. కాలంతోపాటు కదలి వచ్చిన కవి మాత్రమే కాదు, కాలానికి ముందుండి, క్రాంతి దర్శియై జాతాని ముందుకు నడిపించిన కవి శ్రీశ్రీ" అంటారు సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు డాక్టర్ కడియాల రామమోహనరాయ్ "శ్రీశ్రీ సాహిత్యం - జీవితం" అన్న ఈ పుస్తకంలో డా. రామమోహనరాయ్ శ్రీశ్రీ సాహిత్యాన్ని, జీవితాన్ని, సాహిత్యంపై శ్రీశ్రీ ప్రభావాన్ని శ్రీశ్రీపై సామాజిక పరిణామ ప్రభావాలనూ ఆయన ప్రస్తావించారు. డా. రామమోహనరాయ్ విమర్శ సూటిగానూ ఉంటుంది. పుస్తక పరంపరలో మరో పుస్తకం "అంతర్యుద్ధం". ఇది ప్రముఖ సినీకవి ఆచార్య ఆత్రేయ రాసిన నాటిక. ఇందులో శ్రీశ్రీ కూడా ఒక పాత్రధారి కావడం ఇక్కడ విశేషం. వివేకం, ఆవేశం, శ్రీశ్రీ, కార్మికుడు, కర్షకుడు, స్త్రీ, గార్డు ఇందులోని పాత్రలు. ఇది సామాజిక వ్యవస్థమీద సంధించిన అక్షర తూణీరం అని చెప్పాలి.

అలాగే ఈ పుస్తకంలో 'సత్యానికి సంకెళ్లు' అన్న సినిమాలో శ్రీశ్రీ-ఆత్రేయ కలసి రాసిన ఒక పాట కూడ పొందుపరిచారు. ఈ పది పుస్తకాల్లో చివరిది శ్రీశ్రీ సాహిత్యంపై ఆచార్య చేకూరి రామారావు ఆయా సందర్భాల్లో వెలువరించిన పదకొండు వ్యాసాలను అందించారు. 'ఆధునిక సాహిత్యంలో శ్రీశ్రీని మించిన అన్వేషకుడు లేడు. చెప్పదలచుకున్న వస్తువుకు తగిన రీతికోసం నిరంతరం అన్వేషిస్తూనే ఉన్నాడు.... కొంతమంది స్థిరపడ్డ కవుల్లా కాకుండా సాహిత్యంలో వచ్చిన కొత్తను ఆహ్వానిస్తూనే ఉన్నాడు శ్రీశ్రీ" అంటూ శ్రీశ్రీని అభివర్ణించిన డా. చేకూరి వారు-'ధర్య సంస్థాపనార్థాయ, విమర్శకుడిగా శ్రీశ్రీ, శ్రీశ్రీ ఛందోన్వేషణ, మహాప్రస్థానం నుంచి మరో ప్రస్థానం వరకు,.....' మొదలైన పదకొండు వ్యాసాలున్నాయిా పుస్తకంలో. కాగా మొదటి పుస్తకం 'సచిత్రం లఘు సంచిక-9'లో-'సిరిసిరి మువ్వలు, ప్రాసక్రీడలు, లిమరుక్కులు' అందించారు.

మొత్తం మీద శ్రీశ్రీ సాహిత్య నిధి పేరిట సింగంపల్లి అశోక్‌కుమార్ చేస్తున్న కృషి పరిశోధన విద్యార్థులు చేస్తున్న శ్రమకన్నా కొన్ని రెట్లు ఎక్కువనే చెప్పాలి. ఎక్కడెక్కడో శ్రీశ్రీ రాసినవీ, శ్రీశ్రీపై ఇతరులు రాసినవీ శోధించి అందించడం అనేది చిన్న విషయం కాదు. ఈ కృషిలో ఇప్పటికి నూట ఏభై పుస్తకాలు వెలువరించడం చిన్న విషయమూ కాదు. ఈ సాహిత్య కృషినీ, శ్రమనీ ఆదరిస్తున్న పాఠకులు ధన్యులనే చెప్పాలి. ఆయన తలపెట్టిన ఈ యజ్ఞంలో మరో ఏభై పుస్తకాలు రావాల్సి ఉంది. ఈతరం కవులు, కవయిత్రులు, సాహిత్య పిపాసులు, అభిమానులు తప్పనిసరిగా చదవాల్సిన శ్రీశ్రీ సాహిత్యం ఇది. ఆదరిస్తారని ఆశిస్తూ, అశోక్‌కుమార్ సాహిత్య సేద్యానికి హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తూ.....

సర్వజిత్

సాహితి

పట్టాలకు ప్రాణాలున్నాయి

నియంతలు అక్షరాల్ని విశ్వసించక
ఆయుధాల్ని నమ్ముకుంటారు
ప్రజాస్వామ్య పట్టభద్రులు
అక్షరాల్ని నమ్మినట్లు నటించి
ఆయుధాల్ని రహస్యంగా ధరిస్తారు!
ప్రత్యక్షంగా పరోక్షంగా
నిర్దయగా నిర్భయంగా
నియంతలు ప్రజాస్వామ్యవాదులు
పట్టాలే సాక్ష్యాలై
రైళ్ళను పడగొట్టిన చరితలు!
ఎలపట దాపట పట్టాలు
సమతుల్యమై సమభారమై
సమాంతరమై సమ ఉజ్జీయై
రైలుకు ఆహ్వానం పలికి
వీడ్కోలౌతాయి
అత్యంత భారం
అత్యంత వేగమైనా
సాదరంగా స్వాగతించి
స్వాదనంగా సాగనంపుతాయి
మరువు భూముల్లో విధ్వంసానికి
భయపడి పట్టాలు వొణుకుతాయి
స్టేషన్లో క్షేమమై వొదుగుతాయి
ఉష్ణం శీతలం వొంటికి కప్పుకుని
పనివేళల చట్టానికి మంగళం పాడి
ఇరవై నాలుగు గంటలూ విధులు!
పరీక్ష తప్పిన బాలిక బలైనందుకు
రైలాగిపట్టాలు చింతిస్తాయి
ప్రేమే ప్రపంచమై నవదంపతుల
కులాంతర వివాహం
ఆత్మహత్యయినపుడు....
కన్నబిడ్డ కారిన్యానికి
వృద్ధ దంపతులు కీర్తిశేషులైనపుడు
పట్టాల మౌన దుఃఖం
రాతకందని గుండెకోత!
పట్టాలకు ప్రాణాలున్నాయి
ఎండాకాలంలో సాగుతాయి
వర్షాకాలంలో కుంచిస్తాయి
అన్నివేళలా అటూ యిటూ కదులుతూ
బండికి దారిచూపుతాయి
మాట్లాడలేవు గాని
అన్నీ మూగ చర్యలు!

అడిగోపుల వెంకటరత్నమ్,
9848252946

సోమేపల్లి పురస్కార ప్రదానోత్సవ సభ

రమ్యభారతి సాహిత్య త్రైమాస పత్రిక ఆధ్వర్యంలో 14 వ జాతీయస్థాయి చిన్న కథల పోటీలు ఇటీవల జరిగాయి. ఇందలి విజేతలకు 23-7-2023 న ఆదివారం 10 గంటలకు సోమేపల్లి పురస్కార ప్రదానోత్సవ సభలో బహుమతులు అందజేస్తారు. ఈ సభ శ్రీ వేంకటేశ్వర దేవస్థాన ప్రాంగణంలో శ్రీపద్మావతి కళ్యాణ వేదిక, బృందావన్ గార్డెన్స్, 5వ లైను, గుంటూరు నందు జరుగును. ప్రముఖ సాహితీవేత్త శ్రీమతి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తారు. ఈ సభకు ముఖ్య అతిథిగా శ్రీ వల్లూరు శివప్రసాద్ ప్రధాన కార్యదర్శి, అం.ప్ర. అభ్యుదయ రచయితల సంఘం, గౌరవ అతిథిగా శ్రీ చిటిపోతు మస్తానయ్య దేవాలయ కమిటీ అధ్యక్షులు, పోటీ న్యాయనిర్ణేతగా శ్రీ శ్రీకంఠస్ఫూర్తి ప్రముఖ కథా రచయిత, పురస్కార ప్రదాత శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య ప్రముఖ కవి పాల్గొంటారు.

14 వ జాతీయ స్థాయి 'సోమేపల్లి' పురస్కార విజేతలు:
శ్రీమతి బి.కళాగోపాల్,(ప్రథమ పురస్కారం-ఆకుపచ్చని పొద్దు), నిజామాబాద్,
శ్రీ బి.వి.రమణమూర్తి,(ద్వితీయ పురస్కారం-విత్తు) మధురవాడ,
శ్రీ మల్లారెడ్డి మురళీమోహన్ (తృతీయ పురస్కారం-వైకుంఠపాళి) విశాఖపట్నం.
ప్రోత్సాహక ఉత్తమ పురస్కారాలు: శ్రీ శింగరాజు శ్రీనివాసరావు (ఎగిరే ఎద్దు), ఒంగోలు,
శ్రీ బి.వి.శివప్రసాద్ (వెన్నెల దీపం), విజయవాడ, శ్రీ కె.వి.లక్ష్మణరావు (బాధ నుండి బాధ్యత వైపు) మానేపల్లి,
శ్రీమతి కె.వి.సుమలత (ఏది దానం- ఎవరు దాత) గుడివాడ.

కథా ప్రేమికులందరు సభలో పాల్గొనాలని కోరుతున్నారు.

చలపాక ప్రకాష్, సంపాదకుడు, రమ్యభారతి

రాజాం రచయితల వేదిక 102వ సమావేశం

రాజాం రచయితల వేదిక 102వ సమావేశం ఈ నెల 23 ఆదివారం ఉదయం 9.30 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో పొట్నూరు కోటిబాబు అధ్యక్షతన జరుగుతుంది. ఆ సభలో 'కరుణశ్రీ కవితా వైభవం' అనే అంశంపై కిలపర్తి దాలినాయుడు-సాలూరు ముఖ్యప్రసంగం చేస్తారు.

గార రంగనాథం, 9885758123
నిర్వాహకుడు, రాజాం రచయితల వేదిక, ఆంధ్ర ప్రదేశ్

రచనల కోసం విజ్ఞప్తి

(బహుముఖ ప్రజ్ఞాశాలి వాకాటి పాండురంగారావు రచనల గురించి)

కథా, నవలా రచయితగా, సృజనాత్మక సంపాదకుడిగా సమన్వయం కోరిన ఆలోచనాశీలిగా, హాస్యం, వ్యంగ్యం రంగరించిన ఆధ్యాత్మిక, సైన్స్, సామాజిక అంశాల ఉపన్యాసకుడిగా, ఆంధ్రాంగ్లభాషలలో రాణించిన కలం వీరుడిగా వాకాటి పాండురంగారావు (1932-1999) ప్రఖ్యాతులు. ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రతిభా పాండిత్యాలను, సృజనాత్మక కళానైపుణ్యాలను, వ్యక్తిత్వ సౌశీల్యాలను వెల్లడి చేసేట్టు ఒక విశేష సంచికను లేదా సంకలనాన్ని వెలువరించాలనుకుంటున్నాం. వాకాటి వారిని గుర్తు చేసుకుంటే ఇది వరకే వెలువడిన ఇతరుల లేదా మీ రచనలను సూచించడం లేదా పంపడంతో పాటు, ఇప్పుడు కొత్తగా మీ జ్ఞాపకాలనూ వారి రచనలనూ తరచి చూపే రీతిలో అర్థవంతమైన స్పందన కలిగించే సంక్షిప్త వ్యాసాలు రచించి పంపమని మా మనవి.

అలాగే వాకాటి పాండురంగారావు రచించిన కథలు, వ్యాసాలు, సంపాదకీయాలు, నవలలు, కవితలు, గేయాలు, ప్రసంగాలు, ముందు మాటలలో మీకు బాగా నచ్చినవేమిటో కూడా సూచించవచ్చు. ఆణిముత్యాలు వంటి వారి రచనలు కొన్ని ఈ సంకలనంలో జోడించాలని కూడా మా భావన. భావాల చట్రాలకతీతంగా వారి మిత్రుత్వాలు, ఉద్యోగాలు సాగాయి. కనుక అపురూపమైన ఫొటోలు కూడా పంపవచ్చు.

మీరు రచనలు పంపాల్సిన చిరునామా:
Vakati P R, 208, 5th floor, lumbini Rock Castle Apartments,
Road no, 4, Banjara Hills, HYDERABAD-500 003

సంప్రదించాల్సిన మెయిల్ ఐడి: vakati.pr@gmail.com, Mobile: 8790007042

రచనలు, ఫొటోలు, సూచనలు అందించడానికి చివరి తేది: 2023 ఆగస్ట్ 15.

వాకాటి కృష్ణచైతన్య	ఆర్ పవన్ మైత్రేయ	డా.నాగసూరి వేణుగోపాల్
కుమారుడు	మనవడు	(ప్రముఖ రచయిత, ఆకాశవాణి పూర్వ సంచాలకులు)
		సంకలన సంపాదకులు

పేదల వెతలు వర్ణనాతీతం

- దిల్లీ మురికివాడల్లో దారుణ స్థితి
- టార్పోలిన్ల కిందనే ఆశ్రయం
- బహిరంగ మల విసర్జన

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని లోతట్టు ప్రాంతాలను వరదలు ముంచెత్తడంతో మురికివాడల్లో నివసించే పేదల జీవనం దయనీయంగా మారింది. తమ ఇళ్లు మునిగిపోయాయని, ముందుగా అప్రమత్తం చేయకపోవడంతో సర్వం కోల్పోయామని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదని ఆరోపిస్తున్నారు. దిల్లీలోని మయూర్ విహార్, పాత యమున వంతెన ప్రాంతాలలో వరదలకు ప్రభావితమైన వారిలో చాలా మంది నీటిమట్టాలు తగ్గే వరకు అక్కడే వేచి చూస్తున్నారు. టార్పాలిన్‌ల కింద ఉంటూ బహిరంగంగానే నిద్రిస్తున్నారు...బహిరంగంగనే మలవిసర్జన చేస్తున్నారు. 39 ఏళ్ల సీమా అనే మహిళ యమునా నది వంతెన కింద నీట మునిగిన తన ఇంటి వైపు చూపిస్తూ... 'గత 20 ఏళ్లుగా ఇంటికొచ్చి పని చేస్తున్నా... వచ్చే ఆదాయంలో ప్రతి పైసా నా ఇల్లు, పిల్లల కోసం వెచ్చిస్తున్నా. 20 ఏళ్ల శ్రమ, కేవలం మూడు రోజుల్లోనే వృథా అయింది' అని కన్నీటి పర్యంతమైంది. ప్లాస్టిక్ టార్పాలిన్‌లు, పాల ప్యాకెట్ తప్ప ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సాయం అందలేదని, నీటిమట్టాలు పెరుగుతున్నా తమనెవరూ ముందస్తుగా అప్రమత్తం చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. 'ఇంతకుముందు పోలీసులు వరదలకు ముందు మమ్మల్ని అప్రమత్తం చేసేవారు, కాని ఈసారి ఎవరూ మా ఇళ్లను ఖాళీ చేయమని హెచ్చరించలేదు. ఇప్పుడు మురికివాడ మొత్తం నీటిలో మునిగిపోయింది. ప్రభుత్వం చాలా విషయాలు చెప్పింది కానీ మాకు ఏమీ ఇవ్వలేదు. మాకు అందింది కేవలం ఒక టార్పాలిన్, పాల ప్యాకెట్. వారు శనివారం వచ్చి మా పేర్లు రాశారు, అన్ని వివరాలను తీసుకున్నారు, కానీ ఇప్పటివరకు ఏమీ చేయలేదు' అని సీమ పీటీఐకి చెప్పారు. 'మురికివాడల నివాసితులకు పక్కా ఇళ్లు ఇవ్వడం గురించి ప్రభుత్వం మాట్లాడుతుంది కానీ వారు మమ్మల్ని ఇక్కడి నుండి తరలించడానికే ప్రయత్నిస్తున్నారు' అని ఆమె ఆరోపించారు. 2013లో దిల్లీలో సంభవించిన వరదలను గుర్తు చేసుకుంటూ, మయూర్ విహార్‌లోని యమునా నది ఒడ్డున నివసించే 45 ఏళ్ల అశోక్ మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు లేవని తెలిపారు. 2013లో వరదలు వచ్చినా ఇంత దారుణంగా జరగలేదన్నారు. గతేడాది దీపావళి తర్వాత కూడా మా ఇళ్లలోకి నీరు చేరింది కానీ చాలా త్వరగా తగ్గిపోయింది. ఈసారి బ్రిడ్జిని కూడా తాకేలా నీటి మట్టం ఎక్కువైంది. మురికివాడలన్నీ నీటమునిగాయి. తాగునీరు కూడా లేదు. మాకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందలేదు... ఆహారం లేదు, రేషన్ లేదు... మాకు టార్పాలిన్లు కూడా అందలేదని వాపోయారు. నీరు తగ్గిన తరువాత అక్కడకు తిరిగి వెళ్లి, తామే అన్నీ సరిచేసుకోవాలని అశోక్ చెప్పారు. 50 ఏళ్ల సురేశ్ కూడా ఇదే రకంగా స్పందించాడు. గతంలో దిల్లీలో వరదల లాంటి పరిస్థితి వచ్చిన ప్రతిసారీ, వారిని అప్రమత్తం చేయడంతోపాటు ముందుగానే ఖాళీ చేయించారన్నారు. 'ఈసారి మమ్మల్ని ఎవరూ అప్రమత్తం చేయలేదు. మేము ఇక్కడే ఉండి నాలుగు రోజులైంది. మా ఇళ్లలోకి నీరు ప్రవేశించినప్పుడు కొన్ని వస్తువులతో బయటపడ్డాం. మాకు ఎవరూ సహాయం చేయలేదు. మునిగిపోయిన మురికివాడలో ఎవరైనా చిక్కుకున్నారో లేదో తనిఖీ చేయడానికి నిన్న పడవల్ని పంపించారు' అని సురేశ్ పేర్కొన్నాడు. సొంత డబ్బులతో టార్పాలిన్లు కొనుగోలు చేశామని, నీటిమట్టం తగ్గిన తర్వాత తన ఇంటిని చక్కదిద్దుకోవడానికి వేల రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. మహిళలకు వాష్‌రూమ్ సౌకర్యం లేదని, వారు బహిరంగంగా మలవిసర్జన చేస్తున్నారని సురేశ్ పీటీఐకి చెప్పారు. వరద బాధిత ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

కాగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం వరద బాధిత ప్రజలకు వసతి, ఆహారం, నీరు, మరుగుదొడ్లు సహా ప్రత్యేక సహాయక చర్యలను ప్రకటించారు. యమునా నది నీటిమట్టం ఆదివారం ఉదయం 8 గంటలకు 208.66 మీటర్ల గరిష్ఠ స్థాయి నుంచి 205.98 మీటర్లకు తగ్గింది. శనివారం యమునాలో నీటి మట్టం తగ్గుముఖం పట్టే సంకేతాలు కనిపించాయి, అయితే దిల్లీలో సాయంత్రం వర్షపు జల్లుల కారణంగా అనేక రహదారులు జలమయమయ్యాయి.

కొత్తగా 59 కోవిడ్ కేసుల నమోదు

న్యూదిల్లీ: దేశంలో ఆదివారం కొత్తగా 59 కొత్త కోవిడ్-19 కేసులు నమోదయ్యాయి. క్రియాశీల కేసుల సంఖ్య ముందు రోజు నమోదైన 1,408 నుంచి 1,432 కి పెరిగింది. తాజా కేసులతో దేశంలో నమోదైన కోవిడ్-19 కేసుల సంఖ్య 4.49 కోట్లకు (4,49,94,878) పెరిగింది. మృతుల సంఖ్య 5,31,915గా నమోదైంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది. జాతీయ రికవరీ రేటు 98.81 శాతంగా నమోదైంది. వ్యాధి నుండి కోలుకున్న వారి సంఖ్య 4,44,61,531కి పెరగ్గా, మరణాల రేటు 1.18 శాతంగా ఉంది. ఇక దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ డ్రైవ్ కింద ఇప్పటివరకు 220.66 కోట్ల కరోనా నివారణ డోసులను వేయడం జరిగింది.

శరద్ పవార్‌ను కలిసిన అజిత్, ఎన్‌సీపీ మంత్రులు

ముంబై : మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌తో పాటు ఆయన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ శిబిరానికి చెందిన మరికొందరు మంత్రులు ఆదివారం ముంబైలో ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్‌ను కలిశారని ఉప ముఖ్యమంత్రి సన్నిహితుడు తెలిపారు. జులై 2న శరద్ పవార్‌పై తిరుగుబాటు చేసి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో చేరిన తర్వాత శరద్ పవార్, అజిత్ పవార్ నేతృత్వంలోని బృందం మధ్య జరిగిన మొదటి సమావేశం ఇది. ఎన్‌సీపీ మంత్రులు హసన్ ముష్రిఫ్, ఛగన్ భుజబల్, అదితి తత్కరే, దిలీప్ వాల్సే పాటిల్‌తో కలిసి అజిత్ పవార్ రాష్ట్ర సచివాలయం 'మంత్రాలయ' సమీపంలో ఉన్న వైబీ చవాన్ సెంటర్‌లో శరద్ పవార్‌ను కలిశారు. ఎన్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్, పార్టీ నేత జితేంద్ర అవద్ కూడా వైబీ చవాన్ సెంటర్‌కు చేరుకున్నారని శరద్ పవార్ శిబిరం వర్గాలు తెలిపాయి. ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత ప్రతిభా పవార్‌ను కలవడానికి ఎన్‌సీపీ అధినేత అధికారిక నివాసం సిల్వర్ ఓక్‌ని శుక్రవారం అజిత్ పవార్ సందర్శించారు. అజిత్ పవార్ తన అత్త ప్రతిభకు సన్నిహితుడిగా పేరు తెచ్చుకున్నారు. 2019లో అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలిసి స్వల్పకాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత అజిత్‌ను తిరిగి ఎన్‌సీపీలోకి తీసుకురావడంలో ఆమె కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.

జమ్ముకశ్మీర్‌లో అంబులెన్స్‌లకు డ్రైవర్ల కొరత

పూంఛ్/జమ్ము : జమ్ముకశ్మీర్‌లో అంబులెన్స్‌లకు డ్రైవర్ కొరత వేధిస్తోంది. ఇక్కడ పూంచ్ జిల్లాలోని మెంధర్ సబ్ డివిజన్‌లో ఒక గర్భిణీ మరణించడానికి అంబులెన్స్ డ్రైవర్ల కొరత ప్రధాన కారణమని ఆరోపణలు వచ్చాయి. అంబులెన్స్‌లో ఎవరూ లేకపోవడంతో ఆమెను వేగంగా ఆస్పత్రికి తరలించలేకపోయారు. మెంధార్ సబ్ డివిజన్‌లో గత నాలుగు నెలలకు పైగా డ్రైవర్ల కొరత కారణంగా దాదాపు రెండు డజన్ల అంబులెన్స్‌లలో చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి దక్షిణంగా 60 కిలోమీటర్ల దూరంలో నియంత్రణ రేఖకు సమీపంలో ఉన్న సబ్ డివిజన్‌లో కేవలం నలుగురు అంబులెన్స్ డ్రైవర్లను మాత్రమే ఆరోగ్య శాఖ నియమించింది. రుక్సానా కౌసర్ (35) జూన్ 24న అంబులెన్స్ డ్రైవర్ లేనందున లోడ్ క్యారియర్‌లో మాన్‌కోట్‌లోని ప్రజారోగ్య కేంద్రం నుంచి మెంధార్‌లోని సబ్ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించింది. రోగి చికిత్స కోసం పీహెచ్‌సీకి వచ్చినప్పుడు వైద్యుడు, ఫార్మాసిస్ట్ కూడా గైర్హాజరయ్యారని ఆరోపించారు. అప్పటి నుంచి బ్లాక్ వైద్యాధికారి ఇద్దరిపై చర్యలకు సిఫార్సు చేశారు. 'మాకు అంబులెన్స్ డ్రైవర్ల కొరత ఉందనడంలో సందేహం లేదు. సబ్ డివిజన్‌లోని అన్ని పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉప కేంద్రాలలో అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఎక్కువ భాగం పంచాయతీ రాజ్ ఇనిస్టిట్యూషన్ (పీఆర్‌ఐ) సభ్యులు అందించారు' అని మెంధార్ బ్లాక్ వైద్యాధికారి జావిద్ చౌదరి చెప్పారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న రోగులకు, గర్భిణీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విధాలా కృషి చేస్తున్నామని చెప్పారు. మొత్తం సబ్ డివిజన్‌లోని ప్రధాన ఆస్పత్రి ఉన్న మెంధార్‌లో 108, 102 హెల్ప్‌లైన్ ద్వారా అంబులెన్స్ సేవ 24 గంటలూ అందుబాటులో ఉందని చౌదరి తెలిపారు. వైద్యారోగ్య శాఖ వర్గాల సమాచారం ప్రకారం, ఆరోగ్య శాఖ ద్వారా నియమితులైన చాలా మంది అంబులెన్స్ డ్రైవర్లు తమకు జీతాలు సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపిస్తూ నాలుగు నెలల క్రితం వెళ్లిపోయారు. బాలాకోటే తహసీల్‌తో పాటు సబ్ డివిజన్ పరిధిలోకి వచ్చే మంకోటే తహసీల్‌కు చెందిన జిల్లా అభివృద్ధి మండలి సభ్యుడు ఇమ్రాన్ జాఫర్ మాట్లాడుతూ డ్రైవర్ల కొరత కారణంగా గర్భిణీ మరణించడం దురదృష్టకరమని అన్నారు. బాలాకోట్, బాల్నోయి సరిహద్దు ప్రాంతాలు కూడా రోగులను మెంధార్ ఆస్పత్రికి తరలించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. సరిహద్దు గ్రామాల్లోని అన్ని పీహెచ్‌సీలను ఆధునీకరించడంతో పాటు అంబులెన్స్ డ్రైవర్లు అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. తాను ఇప్పటికే పూంఛ్ డిప్యూటీ కమిషనర్ వద్ద సమస్యను లేవనెత్తానని, డ్రైవర్ల సమస్య లేకుండా చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆయన హామీ ఇచ్చారని జాఫర్ చెప్పారు.

గెహ్లోత్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి: నడ్డా

జైపూర్: రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే అర్హత లేదని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా విరుచుకుపడ్డారు. ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరగనున్న రాజస్థాన్‌లో ఆదివారం ఆయన "నహీ సహేగా రాజస్థాన్" పేరుతో రాష్ట్ర వ్యాప్త ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ప్రసంగిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. యూపీఏ- అణచివేత, పక్షపాతం, దౌర్జన్యాలను సూచిస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అనే మంత్రంతో పనిచేస్తోందని చెప్పుకొచ్చారు. మహిళలపై నేరాలు, ఉదయపూర్‌లో కన్హయ్యలాల్ హత్య, మతపరమైన అల్లర్లు , ఇతర అంశాలను ఎత్తిచూపుతూ రూపొందించిన థీమ్ వీడియో ప్రచారాన్ని నడ్డా ప్రారంభించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ 'ఫెయిల్ కార్డ్' ను కూడా ఆయన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను దోచుకుని చిత్రహింసలకు గురిచేస్తోందని, దళితులు, గిరిజనులు, మహిళలు, పిల్లలు, పేదలపై జరిగిన అకృత్యాల రికార్డులన్నీ బద్దలు కొట్టిందని విమర్శించారు. ఒక్క నిమిషం కూడా అధికారంలో ఉండే హక్కు లేదన్నారు. అవినీతిని ప్రోత్సహించడం, అవినీతిలో కొత్త రికార్డులు సృష్టించడం రాజస్థాన్‌లోని అశోక్ గెహ్లోత్ ప్రభుత్వ లక్షణమని ఆయన అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పాకిస్తాన్ నుంచి వచ్చిన శరణార్థుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేసిందని ఆరోపించారు.

రైతులే భారత్‌కు బలం : రాహుల్ గాంధీ



న్యూదిల్లీ : రైతులే భారతదేశానికి బలం అని, వారి మాటలు విని, వారి అభిప్రాయాన్ని అర్థం చేసుకుంటే దేశంలోని అనేక సమస్యలు పరిష్కారమవుతాయని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆదివారం అన్నారు. జులై 8న హరియానాలోని సోనేపట్‌లోని మదీనా గ్రామంలో వరి పొలాలను సందర్శించిన వీడియోను గాంధీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. సుమారు 12 నిమిషాల యూట్యూబ్ వీడియోలో ఆయన రైతులు, వారి కుటుంబాలతో సంభాషించడం, పొలాలను దున్నడం, వరి నారు నాటడం, తరువాత రైతులతో తీగపై రొట్టెలు విరుస్తున్నట్లు చూపిస్తుంది. 'రైతులే భారతదేశానికి బలం' అని ఆయన హిందీలో ట్వీట్ చేస్తూ, వీడియో నుంచి ఒక చిన్న దృశ్యాన్ని పంచుకున్నారు. 'హరియానాలోని సోనేపట్‌లో నేను ఇద్దరు రైతులను కలిశాను. సంజయ్ మాలిక్, తస్బీర్ కుమార్. వారు చిన్ననాటి మంచి స్నేహితులు. చాలా సంవత్సరాలు కలిసి వ్యవసాయం చేస్తున్నారు. 'వాళ్లతో కలిసి పొలాల్లో సాయం చేశాం. వరి నాట్లు వేశాం, ట్రాక్టర్ నడిపాం. ఎన్నో విషయాలు చర్చించుకున్నాం. గ్రామంలోని మహిళా రైతులు తమ సొంత కుటుంబ సభ్యుల్లాగే మాకు ప్రేమ, గౌరవం ఇచ్చి, ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని తెచ్చారు' అని రాహుల్ వివరించారు. 'భారతదేశంలోని రైతులు నిజాయితీపరులు, తెలివిగలవారు. వారికి వారి కృషి తెలుసు. వారి హక్కులను కూడా గుర్తిస్తారు. అవసరమైనప్పుడు వారు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడతారు. బీమా డిమాండ్ల కోసం వారి హక్కును కూడా పెంచుతారు. మనం వారి మాటలు విని, వారి దృక్కోణాన్ని అర్థం చేసుకుంటే, దేశంలోని అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది' అని గాంధీ అన్నారు. 'భారత్‌ను ఏకం చేయడంలో రైతుల భారీ సహకారం ఉంది. వారు ఉత్పత్తి చేసే ధాన్యాలు దేశంలోని ప్రతి ప్లేట్‌లో భాగమే. కానీ వారి 'తపస్సు'కు తగిన గౌరవం లభించదు' అని కాంగ్రెస్ ట్విట్టర్‌లో పేర్కొంది. గాంధీ వీడియోను పంచుకుంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ తన భారత్ జోడో యాత్రను ముందుకు తీసుకువెళుతున్న రైతులు, వ్యవసాయ కూలీలను కలిశారని తెలిపారు. వారితో గడిపి, వారి మాటలు విని, వారి కష్టాలు, సమస్యలు, మనోవేదనలను అర్థం చేసుకున్నట్లు చెప్పారు. 'రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో చెప్పారు. వ్యవసాయం ఎందుకు గతంలో కంటే సవాలుగా మారింది. ద్రవ్యోల్బణం విధ్వంసంతో వారు ఎలా ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ రంగంలో ప్రైవేటీకరణ వల్ల ఎవరు లాభపడుతున్నారు? అనే విషయాలను చర్చించారు. వారికి కూడా కొన్ని కలలు ఉన్నాయని చెప్పారన్నారు. తమ పిల్లలకు కూడా మంచి చదువులు చెప్పాలన్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదు' అని రమేశ్ హిందీలో ట్వీట్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికుల పోరాటానికి అభివాదం చేస్తున్నాం. మన దేశానికి రైతులే వెన్నెముక అని స్పష్టంగా విశ్వసిస్తున్నాం. వారు చెప్పే ప్రతి విషయాన్ని మనం గౌరవంగా, వినయంగా వినాలి' అని తెలిపారు.

చైనా, వియత్నాం నుంచి పెరిగిన ఉక్కు దిగుమతులు

న్యూదిల్లీ: భారతదేశం దిగుమతి చేసుకుంటున్న ఉక్కు దిగుమతిలో చైనా, వియత్నాం వంటి దేశాల వాటా పెరిగింది ఈ ఏడాది జూన్‌లో భారత్ మొత్తంగా 4.84 లక్షల మెట్రిక్ టన్నుల ఉక్కును దిగుమతి చేసుకోగా... నెలవారీగా చూసుకున్నట్లయితే 5.9శాతం పెరుగుదల నమోదైంది. గత ఏడాది జూన్‌లో జరిగి దిగుమతులతో పోల్చినట్లయితే 7.6శాతం అధికం. భారతదేశం మొత్తం దిగుమతుల్లో చైనా, జపాన్, వియత్నాం, సౌదీ అరేబియా, రష్యా, నేపాల్, అమెరికా వాటా జూన్ 22 తో పోలిస్తే జూన్ 23 లో పెరిగిందని ఉక్కు మంత్రిత్వశాఖ అధికారిక డేటా వెల్లడించింది. జూన్ 2022 లో, చైనా నుంచి 26.1 శాతం, వియత్నాం నుంచి 1 శాతం దిగుమతులు ఉండగా జూన్ 2023లో అది వరుసగా 37.1 శాతం, 4.8 శాతంగా ఉంది. భారత్ ... తన ఉక్కు తయారీ సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నులకు పెంచుకోవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యతను సంతరించుకుంది. జూన్‌లో భారతదేశ ఉక్కు ఎగుమతి 5.02 లక్షల మెట్రిక్ టన్నులకి పడిపోయింది. ఇది మే 2023 కంటే 27.6 శాతం, జూన్ 2022 కంటే 21.3 శాతం తక్కువ. భారతదేశ ఉక్కు ఎగుమతుల్లో బ్రిటన్, మెక్సికో, రష్యా, ఇటలీ, పోర్చుగల్, నేపాల్ వాటా జూన్ 2023లో పెరిగినట్లు డేటా చూపించింది. కాగా ఉక్కు తయారీ ముడిసరుకు (ఇనుప ఖనిజం) ధరలు జూన్‌లో టన్నుకు రూ. 3,900ఉందని, మే 2023 స్థాయి నుండి ఎటువంటి మార్పు లేదని అధికారిక డేటా వెల్లడించింది.

అమర్‌నాథ్ యాత్రికులు మరో ఇద్దరి మృతి

శ్రీనగర్ : అమర్‌నాథ్ యాత్రలో ఆదివారం మరో ఇద్దరు యాత్రికులు మరణించడంతో వారి సంఖ్య 27కి చేరింది. జమ్ముకశ్మీర్‌లోని గందర్‌బాల్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుహ మందిరం వద్ద పూజలు చేసేందుకు వెళుతున్న 8 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఉర్మిలాబెన్ మోదీ (53) శనివారం అమర్‌నాథ్ గుహ ఆలయం దిగువ భాగంలో రాయి తగిలి మరణించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు పర్వత రెస్క్యూ టీమ్ సిబ్బంది, మరో యాత్రికుడు గాయపడ్డారని వివరించారు. మరో సంఘటనలో చత్తీస్‌గఢ్‌కు చెందిన మేఘనాథ్ (65) ఆదివారం పుణ్యక్షేత్రానికి పహల్గామ్ మార్గంలో పిస్సుటాప్ వద్ద అపస్మారక స్థితిలో కనిపించాడు. అతనిని ఆస్పత్రికి తరలించగా, అక్కడికి చేరుకునేలోపే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారని అధికారులు వివరించారు. బాల్తాల్ మార్గం గుండా అమర్‌నాథ్ పుణ్యక్షేత్రానికి వెళుతుండగా గందర్‌బాల్‌లోని సింధ్ నుల్లాలో వాహనం పడిపోవడంతో ఎనిమిది మంది కేంద్ర సాయుధ దళం (సీఆర్‌పీఎఫ్) సిబ్బంది గాయపడ్డారని, వారిని రక్షించి బల్తాల్ బేస్ క్యాంపు ఆస్పత్రికి తరలించామన్నారు.

వర్షాలకు 624 మంది మృతి

కేంద్ర హోంశాఖ వెల్లడి

న్యూదిల్లీ : ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో భారతదేశంలో ఇప్పటి వరకు 624 మంది వర్షాలకు సంబంధించిన సంఘటనలలో మరణించినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది దాదాపు 32 శాతం తగ్గింది. 2022తో పోలిస్తే ఈ సంవత్సరం భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో మరణాలు, ఆస్తి నష్టం భారీ వర్షపాతంతో ముడిపడి ఉందని భారత వాతావరణ శాఖ పరిశోధ నలకు హోం మంత్రిత్వ శాఖ గణాంకాలు మద్దతు ఇస్తున్నాయి. అయితే, హిమాచల్ ప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదయింది. గత ఏడాది ఇదే కాలంలో 187 మంది మరణించగా, ఈ సంవత్సరం 99 మంది మరణించారు. ఈ ఏడాది వర్షాల వల్ల పెద్దగా రోడ్డు ప్రమాదాలు జరగలేదంటే దీన్ని వివరించవచ్చని రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారిని ఉటంకిస్తూ ఒక ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. వరదలు, నీటి ఎద్దడిని నివేదించిన ఇతర ప్రాంతాలు కూడా అధిక సంఖ్యలో మరణాలను నివేదించలేదు.

విడదీసిన హింస... కలిపిన ఆశ

- మణిపూర్ పునరావాస శిబిరాల్లోనే బాధితులు
- తమ ఇళ్లకు తిరిగి వెళతామంటున్న స్థానికులు

అకన్‌పట్ (మణిపూర్) : దేశంలో బీజేపీ పాలనలో మత విద్వేషాలు పెచ్చుమీరుతున్న నేపథ్యంలో మణిపూర్‌లో ఇటీవల కాలం నుంచి కొనసాగుతున్న జాతుల ఘర్షణ మరింత ఆందోళన కలిగిస్తోంది. అయితే పాలకుల చర్యలు ప్రజలను విడదీస్తున్నప్పటికీ, వారిలో ఆశ మాత్రం ఐక్యం చేసింది. ఇక్కడ ఒక కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరంలో 700 మందికి పైగా నిరాశ్రయులలో మణిపూర్ పోలీసు శాఖలో కానిస్టేబుల్ అయిన ఎస్.డేవిడ్, అతని కుటుంబం ఉంది. వీరందరిలో ఒకే ఆశ ఉంది. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొని సురక్షితంగా తిరిగి ఇంటికి వెళ్లడం. అస్సాం రైఫిల్స్ దళాలు రక్షించడానికి ముందు వారు అల్లర్లు, పేలుళ్లు, మూక హింసను అనుభవించారు. మోరేహ్, చురాచంద్‌పూర్ నుంచి సైన్యం కార్యాచరణ కమాండ్‌లోని పారామిలిటరీ దళం అస్సాం రైఫిల్స్ వారిని తీసుకువచ్చినప్పటి నుంచి 238 కుటుంబాలు ఇక్కడి ఆదర్శ బాలికల కళాశాలలో ఉన్నాయి. టిన్ రూఫింగ్ ఉన్న కళాశాలలో కెమిస్ట్రీ తరగతి గదిలో ఉంటున్న చంచల్, ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్న తన పిల్లలకు బోధించడంలో నిమగ్నమై ఉంది. మెజారిటీ సామాజిక వర్గానికి చెందిన చంచల్, రాజధాని నగరం ఇంఫాల్ నుంచి 107 కి.మీ దూరంలో ఉన్న మోరేహ్ అనే పట్టణానికి చెందినవారు. మే 3న కుటుంబం మొత్తం భోజనానికి కూర్చున్నప్పుడు తన అనుభవాన్ని గుర్తుచేసుకుంది. 'ఒక గుంపు ప్రతిదానిని దోచుకోవడం మేము విన్నాము. పెద్ద పెద్ద పేలుళ్లు, బుల్లెట్ల వర్షం కురిసింది' అని ఆమె చెప్పింది. 'మేము ఎలాగో ఆశ్రయం కోసం పొరుగున ఉన్న పోలీస్ స్టేషన్‌కి చేరుకున్నాము. మమ్మల్ని మోరే పట్టణంలోని అస్సాం రైఫిల్స్ శిబిరానికి తీసుకువెళ్లారు. ఇంఫాల్ నగరం నుంచి మేము సురక్షితంగా తప్పించుకోగలిగాము' అని ఆమె గుర్తు చేసుకుంది. తన కుటుంబం మొత్తం తమ ఇంటి వద్ద ప్రతిదీ వదిలి వచ్చేసిందని చెప్పారు. మోరేహ్ పట్టణంలో ఒక చిన్న వ్యాపారాన్ని నడుపుతున్న చంచల్ చాలా త్వరగా తన ఇంటికి తిరిగి వెళతానన్న ఆశతో ఉంది. 'బహుశా వెంటనే కాకపోవచ్చు. కానీ నేను పుట్టి పెరిగిన నా ప్రాంతంలో మేము సురక్షితంగా ఉంటామని హామీ ఇచ్చినట్లయితే, నా ఇంటికి తిరిగి రావాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పింది. మణిపూర్‌లో మెజారిటీ మైతేయి, అలాగే, కుకీల మధ్య మే 3 నుంచి జాతి ఘర్షణలు జరుగుతున్నాయి. మైతేయిలు ఇంఫాల్ నగరంలో కేంద్రీకృతమై ఉండగా, కుకీలు కొండలకు మారారు. హింసాకాండలో 160 మంది ప్రాణాలు కోల్పోయారు. వ్యవసాయ మంత్రి తొంగం బిస్వజిత్ సింగ్ నిర్వహిస్తున్న ఈ శిబిరంలో నిర్వాసితులైన మూడు కుటుంబాలు ఒక ఉమ్మడి వంట గదిని నిర్వహిస్తున్నారు. ఇక కానిస్టేబుల్ డేవిడ్, దుండగులు తన ఇంటిని దోచుకున్న వైనాన్ని తన స్మార్ట్‌ఫోన్‌లో చూపించాడు. ఇంఫాల్‌కు 63 కిలోమీటర్ల దూరంలో ఉన్న చురాచంద్‌పూర్‌లో తాను ఉంటున్నానని చెప్పారు. 'మే 4న ఒక గుంపు వచ్చి మా ఇంటిని తగలబెట్టింది. మేము ఎనిమిది రోజులు బీఎస్‌ఎఫ్ శిబిరంలో ఉన్నాము. ఆ తరువాత సైన్యం మమ్మల్ని ఇంఫాల్‌కు తరలించింది' అని అతను చెప్పారు. ఒక్కొక్కరికి నెలకు రూ.500 చెల్లిస్తున్నందున, నిర్వాసితులైన వారు క్వోటాలో రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తున్న ప్రీఫ్యాబ్రికేటెడ్ ఇళ్లకు వెళ్లడానికి సిద్ధంగా లేరు. 'చురాచంద్‌పూర్ మా ఇల్లు, మేము మరెక్కడా ఉండము' అని డేవిడ్ చెప్పాడు. ఆయన అభిప్రాయాలను సంతోష్ అనే రైతు కూడా వినిపించారు. 'ముందస్తుగా నిర్మించిన ఇల్లు మా కష్టాలకు సమాధానం కాదు' అని 30 ఏళ్ల సంతోష్ తెలిపాడు. మోరేహ్‌లో కిరాణా దుకాణం నడుపుతున్న హవాయి బామ్ చోబా... అస్సాం రైఫిల్స్ తనను, ఇతర కుటుంబాలను ఎలా కాపాడిందో కూడా గుర్తుచేసుకున్నాడు. 'కానీ ఇంటికి తిరిగి రావాలనే కోరిక మా హృదయంలో ఉంది. మేము ఒక రోజు తిరిగి వస్తామని నేను కచ్చితంగా అనుకుంటున్నాను' అని ఆయన చెప్పారు. ఆరు కొండ జిల్లాల నుంచి 172 మందిని కలిగి ఉన్న మణిపూర్ కళాశాలలోని మరొక సహాయ శిబిరం శాసనసభ మాజీ స్పీకర్ ఖేమ్‌చంద్ సింగ్ అధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కక్చింగ్ జిల్లాలోని సెరౌ గ్రామంలో నివసించే ఎస్.గాంధీ అనే రైతు తన భయానక కథనాన్ని గుర్తుచేసుకున్నాడు. 'మే 27న మా గ్రామాన్ని ఇతర సమాజం చుట్టుముట్టింది. వారు విచక్షణారహితంగా కాల్పులు జరపడం ప్రారంభించారు. 500 ఇళ్లను తగలబెట్టడంతో పాటు నివాసితులలో ఒకరిని చంపారు. ఆ తర్వాత మూడు రోజులు అస్సాం రైఫిల్స్ మమ్మల్ని రక్షించి ఇంఫాల్‌కు తరలించే ముందు మేము ఇతర కుటుంబాలతో పాటు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆర్.కె.రంజిత్ ఇంట్లోనే ఉన్నాము' అని చెప్పారు. ఎస్.గాంధీ తిరిగి రావాలనే కోరికను వ్యక్తం చేసిన సహాయ శిబిరంలో ఉన్న ఇతర గ్రామస్తులు అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే తమ గ్రామాన్ని కుకీలు చుట్టుముట్టారని వారు భయాందోళన వ్యక్తం చేశారు. 'మేము నిస్సహాయులుగా ఉన్నాము' అని అన్నారు. పరిస్థితిని గమనిస్తున్న సైన్యం, అస్సాం రైఫిల్స్ ఏదైనా ఆకస్మిక హింసకాండ తలెత్తినట్లయితే చక్కదిద్దేందుకు 17 కాలమ్‌లను సిద్ధంగా ఉంచాయి. ఈ సిబ్బంది వారి సాధారణ యూనిట్లు, దాదాపు 24 వేల మందిని రక్షించి, తాత్కాలిక శిబిరాల్లో ఆశ్రయం కల్పించాయి.

మణిపూర్‌లో సంభవించిన హింసను దృష్టిలో ఉంచుకొని సైన్యం, అస్సాం రైఫిల్స్ రాష్ట్రానికి మరిన్ని దళాలను రప్పించాయి. బలగాల సంఖ్యను 170 కాలమ్‌లకు పెంచాయి. మొదటి రాత్రి, ఇంఫాల్‌లో హింసాత్మక ప్రాంతాలైన లాంగోల్, లాంఫెల్, మంత్రిపుఖారి ప్రాంతాల నుంచి 2,300 మంది పౌరులను, తెంగ్నౌపాల్ జిల్లాలో మరో 1,700 మంది పౌరులను తరలించినట్లు అధికారులు తెలిపారు. చురాచంద్‌పూర్‌లో మొదటి రోజు రాత్రే, ఖుముజాంబ, హ్మర్ వెంగ్, సైకోట్, మాంటోప్ లైకై నుంచి 4,600 మంది స్థానికులను సురక్షితంగా రక్షించినట్లు వారు తెలిపారు. 'అనుకూల క్రియాశీల విస్తరణ ఇంఫాల్‌లోని డి-నోటిఫైడ్ ప్రాంతాలతో పాటు అస్సాం రైఫిల్స్‌కు సమీపంలో ఏ కంపెనీ నిర్వహణ లేని తెంగ్నౌపాల్, చురాచంద్‌పూర్ జిల్లాల గ్రామాలలో కూడా వేగవంతమైన ప్రతిచర్యను సులభతరం చేసింది' అని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

బెంగాల్‌లో బీజేపీకి గడ్డుకాలం

పుంజుకున్న లెఫ్ట్ - పెరిగిన ఓట్లు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాలు క్రమంగా పుంజుకోగా ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ బలహీన మౌతోంది. దీంతో 2024 నాటికి బెంగాల్‌లో రాజకీయాల ధోరణి మారిపోనుంది. ఎప్పటిలా రెండు పార్టీల మధ్య కాకుండా త్రిముఖ పోటీకి రాష్ట్రంలో ఆస్కారం కలుగుతుంది. బీజేపీ ఓట్లు క్రమంగా తగ్గిపోతూ ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల నాటికి ఓట్లశాతం క్షీణిస్తుందని తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. బెంగాల్‌లో బీజేపీకి నాలుగు లోక్‌సభ స్థానాల్లో పట్టు ఉండగా తాజా ఎన్నికలతో పాటు గతేడాది జరిగిన స్థానిక పోరులో కాషాయ పార్టీని లెఫ్ట్-కాంగ్రెస్ కలిసి దెబ్బ తీశాయి. జిల్లా పరిషత్‌లు, వందల పంచాయతీ సమితీలు, గ్రామ పంచాయతీ స్థానాల్లో బీజేపీకి చుక్కలు చూపించాయి. ప్రతిపక్ష ఓట్లు చీలి టీఎంసీ ప్రయోజనం పొందింది. పంచాయతీ ఎన్నికలలో అధిక స్థానాలను గెలుచుకోగలిగింది.

లెఫ్ట్, కాంగ్రెస్, ఐఎస్ఎఫ్ కూటమిగా ఏర్పాటు కాగా 2021లో పది శాతంగా ఓట్లను ప్రస్తుతం 20శాతానికి పెంచుకుంది. మరోవైపు బీజేపీ ఓట్లు 2021లో 38శాతం నుంచి 23శాతానికి పడిపోయాయి. దాదాపు బీజేపీకి సమాన స్థాయికి లెఫ్ట్ ఓట్లశాతం చేరటం ఆ పార్టీకి దడ పట్టిస్తోంది. 2021 అసెంబ్లీ ఉప ఎన్నికలు, 2022లో స్థానిక ఎన్నికలప్పుడు పరిస్థితులను గమనిస్తే లెఫ్ట్ ఓట్లు పెరిగాయి. బీజేపీ ఓట్లు తగ్గిపోయాయి. బీజేపీ 22.9శాతం ఓట్లతో 18.24శాతం గ్రామ పంచాయతీ స్థానాలు, 12.25శాతం పంచాయతీ సమితీలు, 26 జిల్లా పరిషత్‌లను గెలచుకుంది. లెఫ్ట్ 13.2శాతం ఓట్లతో 5.8శాతం గ్రామ పంచాయతీ స్థానాలను, 2.3శాతం పంచాయతీ సమితీ స్థానాలను, రెండు జిల్లా పరిషత్ స్థానాలను కైవసం చేసుకుంది. ఇంకా కాంగ్రెస్ 6.2శాతం ఓట్లతో 4.82శాతం గ్రామ పంచాయతీ స్థానాలు, 3.2శాతం పంచాయతీ సమితి స్థానాలు, 12 జిల్లా పరిషత్ స్థానాలను దక్కించుకుంది. ఓట్లు తక్కువగా ఉన్నా వామపక్షాల కంటే అధిక స్థానాల్లో గెలిచింది. కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా మాల్డా, ముర్షిదాబాద్ జిల్లాలపై దృష్టి పెడితే వామపక్షాలు రాష్ట్రంలోని మధ్య-దక్షిణ ప్రాంతాలపై దృష్టి పెట్టడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. అయితే ఆయా ప్రాంతాల్లో లెఫ్ట్ ఓట్లవాటా 16శాతం కంటే ఎక్కువగా ఉండటంతో బీజేపీ అనేక జిల్లా పరిషత్ స్థానాలను కోల్పోయింది. సీపీఎం కూడా కొన్ని చోట్ల బీజేపీ వల్ల ఓడిపోగా ఈ పరిస్థితులు టీఎంసీకి అనుకూలంగా పరిణమించి ఆ పార్టీ అనేక స్థానాల్లో గెలిచింది. ఎన్నికలప్పుడు హింస జరిగినా వామపక్ష పార్టీ ఓట్లు పెరిగాయి. బీజేపీ ఓట్లు తగ్గిపోయాయి. అయితే లెఫ్ట్ బలాన్ని పుంజుకొని బీజేపీ గట్టి పోటీ ఇస్తోంది. సమానస్థాయి ఓట్లశాతంతో ముందుకు సాగుతోంది. దీంతో అధికారిక ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ క్రమంగా బలహీనపడి లెఫ్ట్-కాంగ్రెస్-ఐఎస్ఎఫ్ కూటమి పుంజుకుంటూ నిజమైన విపక్షంగా వ్యవహరిస్తోంది. తాజా పరిణామాలతో రాష్ట్రంలో త్రిముఖ పోటీకి అవకాశాలు పెరిగాయి. ఎప్పటిలా రెండు పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉండబోదు. 1988లో ఏర్పడిన టీఎంసీ క్రమంగా కాంగ్రెస్‌ను వెనక్కు నెట్టివేసింది. 2014లో బీజేపీ పుంజుకుంది. ఏదిఏమైనా బెంగాల్ రాష్ట్రంలో వామపక్షాలు పుంజుకోవడం కాషాయ పార్టీ గుండెల్లో రైళ్లు పెరిగెత్తిచ్చే విషయం. 2024లో జరగబోయే లోక్‌సభ ఎన్నికలపైనా రాష్ట్ర ఎన్నికల ఫలితాల ప్రభావం ఉంటుంది. అయితే సార్వత్రిక ఎన్నికల ఫలితాలను జాతీయస్థాయిలో చోటుచేసుకునే అనేక పరిణామాలు ప్రభావితం చేస్తాయి. రామ మందిరం పేరిట బీజేపీ మతరాజకీయాలు, ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ప్రజల మనోభావాలను అనుకూలంగా మార్చుకోగలగడం, కాంగ్రెస్-లెఫ్ట్ పురోగతి, బీజేపీకి సైద్ధాంతిక రాజకీయ ప్రత్యర్థిగా నిలవడం వంటి అనేక అంశాలకు ప్రాధాన్యత ఉంటుందని జేఎన్‌యూ ప్రొఫెసర్, రాజకీయ నిపుణులు భట్టాచార్య అభిప్రాయపడ్డారు. బెంగాల్‌లో లెఫ్ట్ పుంజుకోవడంతో బీజేపీకి గడ్డుకాలానికి సంకేతమని నొక్కిచెప్పారు.

అక్టోబరులో అరసం తెలంగాణ రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర -హైద్రాబాద్: అరసం తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఈ ఏడాది అక్టోబరులో నిర్వహించేందుకు అరసం కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. ఆదివారం హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో అరసం రాష్ట్ర అధ్యక్షులు ఆర్వీ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో మహాసభల నిర్వహణతో పాటు వివిధ సాహితీ అంశాలపై చర్చించారు. ఇటీవల మేధావులను, కళాకారులను అణచడానికి కేంద్రం ఉపా చట్టాన్ని ప్రయోగించడం, ఉమ్మడి పౌర స్మృతి కోసం యత్నించడం మొదలైన ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను సమావేశం ఖండించింది. జి.చంద్రమోహన్ గౌడ్, కన్నం లక్ష్మీనారాయణలు అభ్యుదయ గేయాలను వినిపించారు. ఈ సభలో వేల్పుల నారాయణ, రాపోలు సుదర్శన్ , కేవీఎల్ , పల్లేరు వీరస్వామి, నిధి, బీ నాగభూషణం, జీ తిరుపాలు, ఏలేశ్వరం వెంకటేశం, వై లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు వారాల్లో అఫిడవిట్ ఇవ్వాలి

- బాల్యవివాహాల నిరోధక చట్టం అమలుకు చర్యలపై కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: బాల్యవివాహాల నిరోధక చట్టానికి సంబంధించిన అంశాలపై సమగ్ర వివరాలతో అఫిడవిట్‌ను ఆరు వారాల్లో సమర్పించాలని కేంద్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. చట్ట ప్రకారం బాల్య వివారాల నిరోధానికి కేంద్రంతో పాటు రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలను వెల్లడించాలని సూచించింది. రాష్ట్రాల వారీ వివరాలతో స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని ఈ ఏడాది ఏప్రిల్‌లోనూ న్యాయస్థానం ఆదేశించింది. చట్టం సమర్థ అమలుకు అనుసరించిన విధానాల వివరాలను కోరింది. చట్టంలోని సెక్షన్ 16 కింద బాల్య వివాహాల నిరోధక అధికారుల నియామకాలపై రాష్ట్రాల చర్యలను వెల్లడించాలని కూడా సూచించింది. అలా నియమితులైన అధికారులకు బహువిధమైన విధులు అప్పగిస్తున్నారా అని కూడా ఆరా తీసింది. ఈ వ్యవహారాన్ని సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారించింది. అన్ని వివరాలను సేకరించి, సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించేందుకుగాను ఆరు వారాల గడువును అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భారతి ఫిర్యాదు మేరకు న్యాయస్థానం మంజూరు చేసింది. తదుపరి విచారణ సెప్టెంబరు ఒకటో తేదీన జరుగుతుందని తెలిపింది. బాల్య వివాహాల నిరోధక చట్టం -2006 అమలు పూర్తిస్థాయిలో జరగడం లేదని లేదని ఓ ఎన్జీవో సమర్పించిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది.

అన్ని రాష్ట్రాల్లో హెడ్‌లోడు కార్మికుల సంక్షేమ బోర్డులు

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: హెడ్‌లోడు కార్మికుల కోసం మహారాష్ట్ర, కేరళ తరహాలో అన్ని రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అఖిల భారత లోడింగ్, అన్‌లోడింగ్ వర్కర్ల సమాఖ్య (ఏఐటీయూసీ) జాతీయ అధ్యక్షుడు ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. దిల్లీలోని ఏఐటీయూసీ భవన్‌లో ఆదివారం ఆయన అధ్యక్షతన జరిగిన జాతీయ స్థాయి సమావేశం జరిగింది. బాలరాజు మాట్లాడుతూ దేశంలో ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్)ను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వ విధానం ఉందన్నారు. పీడీఎస్‌పై ఆధారపడిన వారు మాత్రమే కాకుండా లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులపై దీని ప్రభావం ఉందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి కేంద్రం తీసుకున్న నిర్ణయాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థను దశలవారీగా రద్దుచేసే యత్నాలు ఆక్షేపణీయమన్నారు. ఆగస్టు 9న అన్ని కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్తంగా 'మహా పడవ్ ఆందోళన్' నిర్వహించనున్నాయని, అందులో లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికుల సమాఖ్య అన్ని రాష్ట్ర సంస్థలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి, కార్మికుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సుకుమార్ దామ్లే మాట్లాడుతూ మహాపడవ్ ఆందోళనలో రాష్ట్రాల వారీగా ప్రదర్శనలు ఉంటాయన్నారు. హెడ్‌లోడ్ వర్కర్లు అందరికీ పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్.వెంకటసుబ్బయ్య (ఆంధ్రప్రదేశ్), శేఖర్ (తెలంగాణ), లీనా చటర్జీ (పశ్చిమ బెంగాల్), కామ్ మాధురీ క్షీరసాగర్ (మహారాష్ట్ర), సత్పాల్ సరవా (హరియాణా), పీఎస్ నాయుడు (కేరళ), గుర్మీత్ సింగ్, రంజిత్ సింగ్ (పంజాబ్) పాల్గొన్నారు.

దిల్లీ అధికారాలపై కేంద్ర ఆర్డినెన్స్‌కు పార్లమెంటులో మద్దతివ్వం

- ఫెడరల్ వ్యవస్థకు నష్టం కలిగించే ప్రతి చర్యను అడ్డుకుంటాం: కాంగ్రెస్
- ఇది సానుకూల పరిణామం, కర్నాటక సమావేశానికి వస్తాం : ఆప్

న్యూఢిల్లీ: దిల్లీలో అధికారాలపై కేంద్ర ఆర్డినెన్స్‌కు పార్లమెంటులో మద్దతివ్వమని, దేశ ఫెడరలిజానికి విఘాతం కలిగించే చర్యలను అడ్డుకుంటామని కాంగ్రెస్ స్పష్టంచేసింది. ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాల పరిపాలన వ్యవహారాల్లో గవర్నర్ల ద్వారా జోక్యానికి కేంద్రం చేసే చర్యలను వ్యతిరేకిస్తామని, దీనిపై పార్టీ స్పష్టమైన వైఖరితో ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. దిల్లీ ఆర్డినెన్స్‌కు సంబంధించి బిల్లును ఎప్పుడు ప్రవేశపెడితే అప్పుడు అడ్డుకోవాలని నిర్ణయించామన్నారు. సాధారణంగా పార్లమెంటులో ప్రవేశపెట్టే కీలకాంశాలపై నిర్ణయం తీసుకునేందుకు సెషన్‌కు ముందు పార్లమెంటరీ వ్యూహ కమిటీ సమావేశాన్ని కాంగ్రెస్ నిర్వహిస్తుంటుందని వేణుగోపాల్ చెప్పారు. శనివారం కూడా ఇలాంటి సమావేశం జరిగిందని, ఇందులో దిల్లీ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇదొక్కటే కాదు దేశ ఫెడరల్ వ్యవస్థకు నష్టం కలిగించే ప్రతీది వ్యతిరేకిస్తామని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ వైఖరిని స్పష్టం చేసిన క్రమంలో బెంగళూరులో జరగబోయే ప్రతిపక్షాల సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పాల్గొంటుందని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రకటనను ఆమ్ ఆద్మీ పార్టీ స్వాగతించింది. ఇది సానుకూల పరిణామమని పేర్కొంది. ఆర్డినెన్స్‌ను నిస్సందేహంగా వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ చెప్పడంతో బెంగళూరు సమావేశానికి తప్పక హాజరవుతామని ఆప్ నేత రాఘవ్ చద్దా ప్రకటించారు. ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చర్చల అనంతరం ఈ మేరకు నిర్ణయించినట్లు తెలిపారు. సోమవారం విందులోనూ పార్టీ అధ్యక్షుడు, దిల్లీ సీఎం కేజ్రీవాల్ పాల్గొంటారని చద్దా వెల్లడించారు. పార్లమెంటులో కేంద్ర ఆర్డినెన్స్‌కు మద్దతు ఇవ్వమని కాంగ్రెస్ స్పష్టతిస్తే తప్ప బెంగళూరు సమావేశానికి రాబోమని ఆప్ ఇంతకుముందే వెల్లడించింది. ఇప్పుడు కాంగ్రెస్ మద్దతివ్వమని ప్రకటించడంతో విపక్షాలతో కలిసి ముందుకెళ్లేందుకు సిద్ధమైంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించేలా ఉమ్మడి వ్యూహాన్ని రచించేందుకు ప్రతిపక్ష పార్టీల నేతలు ఈనెల 17, 18 తేదీల్లో కర్నాటక రాజధాని బెంగళూరులో సమావేశమవుతున్న విషయం విదితమే.

మాజీ సెలెక్టర్ జయరామ్ కన్నుమూత

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ సెలెక్టర్ కార్తిక్ జయరామ్ (67) కన్నుమూశారు. కేరళ రంజీ జట్టు కెప్టెన్‌గా చెరగని ముద్ర వేసిన ఆయన గుండెపోటుతో శనివారం ప్రాణాలు విడిచాడు. అతడి మృతిపట్ల బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ తో సహా కేరళ క్రికెట్ పెద్దలు సంతాపం వ్యక్తం చేశారు. 'అప్పట్లో కేరళ జట్టులో అద్భుతమైన ఆటగాళ్లు ఉండేవాళ్లు కాదు. కానీ, జయరామ్ మాత్రం చాలా ప్రత్యేకం. అతనొక అద్భుతమైన క్రికెటర్. అంతకుమించి ఒక మంచి మనిషి. సెలెక్టర్‌గా ఎప్పుడూ ప్రతిభావంతులైన క్రికెటర్ల కోసం అన్వే షిస్తూ ఉండేవాడు. అతడి మరణవార్త నన్ను ఎంతగానో కలిచి వేసింది' అని రోజర్ బిన్నీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాడు. టీమిండియా సెలెక్టర్ అవ్వడానికి ముందు అతను కేరళ రంజీ జట్టు కెప్టెన్‌గా సేవలందించాడు. జయరామ్ కేరళ లోని ఎర్నాకులం పట్టణంలో జన్మించాడు. దేశవాళీలో అతను 42 మ్యాచ్‌ల్లో కేరళకు ప్రాతినథ్యం వహించాడు. అంతేకాదు 1981-83 మధ్య కాలంలో అతను కేరళ జట్టును నడిపించాడు.

వైసీపీకి 175 సీట్లు వస్తాయ్: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి 175/175 సీట్లు గెలుచుకోగలదని ఆ పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పార్టీ ముఖ్య నేతలతో ఆయన ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, పార్టీ పరిశీలకులు పాల్గొన్నారు. సజ్జల మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో సవరణల్లో పార్టీ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దొంగఓట్ల తొలగింపు, అర్హులను ఓటర్లుగా చేర్చే విషయంలో చురుకుగా ఉండాలన్నారు. తొమ్మిది నెలల్లో ఎన్నికలు రాబోతున్న తరుణంలో పార్టీకి ప్రతిరోజు కీలకమేనని నొక్కిచెప్పారు. పార్టీ పరిశీలకులంతా ఎమ్మెల్యేలకు, సమన్వయకర్తలకు సంధానకర్తలుగాను, క్రియాశీలకంగాను వ్యవహరించాలన్నారు. వలంటీర్లపై ప్రతిపక్షాల విషహరిత ప్రచారాన్ని తిప్పికొట్టాలని సజ్జల పిలుపునిచ్చారు.

తొలి మ్యాచ్‌లో టీమిండియాకు ఓటమి

ఢాకా: ఐసీసీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఇక్కడి నేషనల్ స్టేడియంలో భారత్, బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్ల మధ్య ఆదివారం జరిగిన మొదటి వన్డేలో టీమిండియా పరాజయం చవి చూసింది. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ మహిళల జట్టు 40 పరుగుల తేడాతో గెలుపొంది సిరీస్‌లో 1-0తో ఆధిక్యం లో నిలిచింది. భారత్ పతనాన్ని శాసించిన బంగ్లా బౌలర్ మరుఫా అక్తర్ (4 వికెట్లు) కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. 153 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ప్లేయర్ స్మృతి మందానా మూడో ఓవర్లోనే పెవిలియన్ చేరింది. తర్వాత భారత్ క్రమంగా వికెట్లు పారేసుకుంది. స్వల్ప వ్యవధిలోనే మరో ఓపెనర్ ప్రియాపునియా, కెప్టెన్ హర్మన్, యస్తికాస్తి భాటియా, జెమిమా నలుగురూ ఔట్ అవడంతో టీమిండియా మరింత ఒత్తిడిలో పడింది. దీంతో భారత్ 61 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆల్‌రౌండర్ దీప్తీశర్మ కూడా 91 పరుగుల వద్ద పెవిలియన్ చేరడంతో బంగ్లాదేశ్ విజయం లాంఛన మైంది. ఆ తర్వా త వరుసగా వికెట్లు కోల్పోయిన టీమిండియా... 35.5 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ బౌలర్లలో మరూఫా అక్తర్ 4, రబియాఖాన్ 3, నహిదా అక్తర్, సుల్తానా తలో వికెట్ పడగొట్టారు. కాగా ఇరు జట్ల మధ్య రెండో వన్డే మ్యాచ్ బుధవారం జరగనుంది. అంతకుముందు టాస్ గెలిచిన టీమిండియా మొదట బంగ్లాదేశ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అయితే వర్షం కారణంగా నిర్వాహకులు మ్యాచ్‌ను 44 ఓవర్లకు కుదించారు. మొదటి నుంచే టీమిండియా బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని బ్యాటర్లను 43 ఓవర్లలో 152 పరుగులకే కట్టడి చేశారు. 39 పరుగులు చేసిన బంగ్లా కెప్టెన్ సుల్తానా ఈ మ్యాచ్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో అమన్జోత్ కౌర్ 4 వికెట్లతో సత్తా చాటగా... దేవిక వైద్య 2, దీప్తీ శర్మ ఒక వికెట్ పడగొట్టారు.

సెమీస్‌లో లక్ష్యసేన్ పరాజయం

న్యూఢిల్లీ: యూఎస్ ఓపెన్ సూపర్ 300 షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ పోరాటం ముగిసింది. పతకంపై ఆశలు రేపిన అతను సెమీఫైనల్లో పోరాడి ఓడిపోయాడు. చైనా క్రీడాకారుడు లీ షి ఫెంగ్ చేతిలో అనూహ్యంగా కంగుతిన్నాడు. గంట 16 నిమిషాలు జరిగిన మ్యాచ్‌లో 17-21, 24-22, 17-21తో ఓటమి పాలయ్యాడు. ఫెంగ్‌పై మెరుగైన రికార్డు ఉన్న లక్ష్యసేన్ సులభంగానే ఫైనల్ చేరుతాడని అనుకున్నారంతా. ఎందుకంటే..? వారం క్రితమే కెనడా ఓపెన్ ఫైనల్లో లక్ష్యసేన్ అతడిని ఓడించి ట్రోఫీ అందుకున్నాడు. కానీ, అద్భుతంగా ఆడిన చైనా టెన్నిస్ స్టార్ రెండు సెట్లలో అధిక్యం కనబరిచి ఫైనల్‌కు దూసుకెళ్లాడు. దాంతో, వరుసగా రెండో టైటిల్ నెగ్గాలనుకున్న లక్ష్యసేన్‌కు నిరాశే మిగిలింది. ఈ సీజన్‌లో లక్ష్యసేన్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. వారం కిందటే కెనడా ఓపెన్ టైటిల్ సాధించాడు. దాంతో, ఈ ఏడాది తొలి డబ్ల్యూటీఏ టూర్ టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు. యూఎస్ ఓపెన్ టోర్నమెంట్‌లో అదే జోరు కొనసాగించాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.